అడుగడుగునా ఆపదలే!

కె. శివరామ్

టెలిఫోన్ మ్రోగింది.

డిటెక్టివ్ యువరాజ్ రిసీవర్ అందుకున్నాడు. "యస్! యువరాజ్ స్పీకింగ్!"

"మీకు ఒక రహస్యం చెప్పాలి" అన్నాడు అవలివైపు వ్యక్తి.

"ఊఁ. చెప్పండి."

"ఫోనులో చెప్పడం అంత మంచిదికాదు. కనక మీరు ఊరుకు రెండుమైళ్ళ దూరంలోగల ఒక నిర్జన ప్రదేశానికి రావాలి," అన్నదా కంఠం.

"మీరెవరు? ఇపుడు ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నారు? మీరు చెప్పబోయే రహస్యం దేనికి సంబంధించినది? ప్రత్యే

కించి నాతో చెప్పడానికిగల కారణమేమిటి?" అడిగాడు యువరాజ్ గబగబా.

"నా పేరు సాబర్! నేను హోటల్ ఎంపైర్ నెంబర్ పది గదిలోనుండి మాట్లాడుతున్నాను. నేను చెప్పబోయే రహస్యం ఫలానా దానిని గురించినదని యిపుడు ఫోనులో చెప్పడానికి వీలుపడదు. మీతో చెప్పడానికి గల కారణం మీ గురించి నాకు బాగా తెలియడమే!"

"చూచాయగానైనా చెప్పగలరా?"

"చెప్పలేను."

"మీ సమీపంలో యెవరైనా వున్నారా?"

"లేరు."

"అయితే చెప్పడానికి అభ్యంతరం ఏమిటి?"

"కొందరు రౌడీలు నన్ను అనుసరిస్తున్నారు."

"రౌడీలకు, మీరు చెప్పబోవు రహస్యానికి సంబంధ ముందా?"

"ఆ విషయాలను మీకు ఏకాంతంగా చెప్పగలను."

యువరాజ్ అయిష్టంగానే బదులు చెప్పాడు. "అలాగే వస్తాను. ఎక్కడికి రమ్మన్నారు?"

"రెండు మైళ్ళ దూరంలోగల కాసర కొండ సమీపాన సముద్రపుటొడ్డుకు!!" చెప్పాడు సాబర్.

2

సిత్రన్ ఆగింది. ఆ ప్రదేశం నిర్జనంగా ఉండడమే గాక మనసుకు ఆహ్లాదం కలిగిస్తూంది.

దగ్గరలో కాసర కొండ. కొండకు ఆనుకునివున్న చిన్న అడవి. అడవిలో గల రకరకాల గుబురైన చెట్లు, పొదలు.

రివ్వున వీచే గాలి! ఆ గాలికి యెగిరెగిరి పడే పైని యువ రాజ్ పాంటులోకి దోపుకున్నాడు.

అటు యిటు దృష్టిని మళ్ళించి చూచాడు యువరాజ్. యువరాజుకు చాలా దూరంలో ఒక కారుండడం కనబడింది. ఆ కారువద్దకు నడిచాడు.

అది అంబాసిడర్ కారు. ఆకు పచ్చరంగుది! నెంబరు ఎం. ఎస్. వై. 88008.

లోపల చూచాడు. ఖాళీగా వుంది. ఎవరూ లేరు. సీట్ మీద ఏదో టికెట్ కనిపించింది. దాన్నితీసి చూసి జేబులో వేసుకున్నాడు.

సాబర్ ఎటువెళ్ళి ఉంటాడు? హారన్ మోగిస్తే?

యువరాజ్ కారు హారన్ అదిమాడు. ఆ ప్రదేశంలో ఆ మోత హోర త్తిపోయింది.

రెండు మూడుసార్లు హారన్ మోగించిన పిదప యువరాజ్ హారన్ మోతవిని సాబర్ వస్తాడని కారుకి ఆనుకుని సిగరెట్ కేస్ తీసి, సిగరెట్ ముట్టించుకున్నాడు.

సిగరెట్ తాగుతూ ఆ ప్రదేశాన్నంతా తిలకిస్తున్నాడు యువరాజ్.

సాబర్ ఎంత సేపటికి రాలేదు. ఏమైయ్యాడు? ఈ కారు సాబర్ దేనా? ఇంకెవరిదైనానా? సిగరెట్టు పూర్తిగా తాగడం అయింది. అప్పటికీ సాబర్ రాలేదు.

యువరాజ్ కు యేవేవో ఆలోచనలు, అనుమానాలు తల లెత్త నారంభించాయి.

కారు ప్రక్కనే చూశాడు అడుగుజాడల కోసం.

కారునుండి దిగిన నిదర్శనంగా అడుగుజాడలు కనబడినవి. తన అడుగుజాడలూ ఉన్నవి. సాబర్ అడుగుజాడలు పొద వైపుకు వెళ్ళి ఉన్నవి.

యువరాజ్ అటు నడిచాడు. అడుగుజాడలు పొదల మధ్యగుండా వెళ్తున్నవి.

ఒక పెద్ద బండరాయివద్ద కెళ్ళి ఆ అడుగుజాడలు ఆగిపోయి

వున్నై. అంటే ఆ రాయిమీద కూర్చోడానికి సాబర్ నడిచి వచ్చి ఉండాలని అనుకున్నాడు.

అయితే సాబర్ ఏడి? అక్కడా లేడు! ఎటు వెళ్ళి వుంటాడు? ఆలోచిస్తూ ఆ రాయిచుట్టూరా చూశాడు.

యువరాజ్ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

అక్కడ చాలా అడుగుజాడలున్నై.

ఆ అడుగుజాడలను తిలకిస్తూ అనుసరించాడు యువరాజ్. ముత్తానికి యేదో జరిగిందని వూహించాడు. ఫలానా అని నిర్ణయించుకోకపోయినా సాబర్ని ఎవరో ఎత్తుకెళ్ళి ఉండాలని అడుగుజాడల తీరునుబట్టి అర్థం చేసుకున్నాడు.

అడుగుజాడలు నేరుగా యువరాజ్ని సముద్రంలోకి తీసుకెళ్ళినై! యువరాజ్ ఆశ్చర్య చకితుడైపోయాడు. అక్కడ నుండి అడుగుజాడలు ఎటు వెళ్ళినవో తెల్సుకోడానికి సాధ్య పడలేదు.

సముద్రంలోకి వెళ్ళారా? లేక సముద్రపు ఒడ్డునే నడిచి వెళ్ళారా? ఒడ్డునే నడిచివెళ్ళి వుంటే అడుగుజాడలను సముద్రపు కెరటాలు మాయంచేసి వుంటాయి. జాడలు కనబడవు.

అలా ఒడ్డున కొద్దిదూరం నడిచి వెళ్ళాడు ఆలోచిస్తూ. అక్కడ "ప్రమాదం ఇక్కడ స్నానం చేయకండి. భయంకరమైన సొర చేపలు తిరుగుతూ వుంటాయి!" అని బోర్డుంది.

యువరాజ్ వళ్ళు జలదరించిపోయింది.

ఆ బోర్డు-అడుగుజాడలు, వూహిస్తే సాబర్ని సొరచేపలకు ఆహారంగా యిచ్చి వుండాలని అనుమానం కలిగింది.

సముద్రంలో నెట్టకపోతే ఆ వ్యక్తులు సాబర్ని ఎత్తుకుని నీటివద్దకు ఎందుకు వస్తారు? ఒకవేళ సముద్రంలో నుండి ఏదైనా పడవను ఎక్కారా? ఏమో. అదీ సంభవమే!

3

యువరాజ్ వెళ్ళిన తరువాత ఎక్స్చేంజికి ఫోన్ చేసి,

యువరాజ్ కు వచ్చిన ఫోన్ కాల్ ఎక్కడిదో తెలియజేయ మని రిక్వెస్ట్ చేశాడు అసిస్టెంట్ సూరి.

హోటల్ ఎంపైర్ అని తెల్సింది.

సూరి చీటిరాసిపెట్టి ఎంపైర్ కు బయలుదేరాడు. సాబర్ని గురించి యువరాజ్ తెల్సుకుంటాడని సూరికి తెల్సు. ఏదో రహస్యం చెప్పడానికి సాబర్ యువరాజ్ ని కాసర కొండ వద్దకు రమ్మన్నాడంటే ఏదో విశేషం వుంటుందని సూరి అనుకున్నాడు. అందుకే సాబర్ని గురించి చాటుగా తెల్సు కోవడం మంచిదని, బయలుదేరుతూ యువరాజ్ తనకు చెప్పి వెళ్ళాడు.

సూరి వోక్స్ వాగన్ కారు హోటల్ ఎంపైర్ ఆవరణలో ఆగింది.

కౌంటర్ వద్ద కెళ్ళి నెంబర్లున్న బోర్డువంక చూశాడు. పదవ నెంబరు గదిలోవున్న కాగితంలో 'మిస్టర్ సాబర! హాంగ్ కాంగ్' అని వుంది.

సూరికి విచిత్రమేసింది. సాబర్ హాంగ్ కాంగ్ నుండి వచ్చినవాడా? అతనికి యువరాజ్ యెలా తెల్సింది? యువ రాజ్ కు చెప్పబోవు రహస్యం ఏమిటి?

"నేను డిటెక్టివ్ యువరాజ్ అసిస్టెంటుని. మిస్టర్ సాబర్ గురించిన విషయాలు కావాలి," అడిగాడు సూరి.

"సాబర్, హాంగ్ కాంగ్ నుండి విలాసయాత్రకై ఇండియా వచ్చినవాడు. ఆయనవద్ద పాస్ పోర్టు వీసా వున్నవి" అన్నాడు కౌంటర్.

"ఆయనను గురించి మీకింకేమీ తెలియదా?"

"ఆయన యీ హోటల్ కువచ్చి ఈరోజుతో నాలుగు రోజులే అవుతూంది. ఈనాల్గు రోజులలోను సాబర్ని గురించి నాకేమీ తెలియదు. పైగా తెల్సుకోలేదు. ఎందుకంటే ఆయన ప్రవర్తనలో అనుమానం కల్గలేదు," చెప్పాడు కౌంటర్.

"ఆయనకోసం ఎవరైనా వచ్చేవారా?"

"లేదు."

సూరి సాబర్ గదికి వెళ్ళాడు. సాబర్ వుండడని తెల్సు. కానీ... వెళ్ళి చూడడం మంచిదనిపించింది. గదిముందు నిలబడి తాళంవంక చూశాడు. తాళం వేసిలేదు.

తలుపు నెట్టి చూశాడు సూరి. లోపల గడియ వేయబడి వుంది. అంటే లోపల ఎవరో వున్నారు. ఎవరది?

కిటికీగుండా చూడబోయాడు. కర్టన్ అడ్డువుంది. చూపుడు వ్రేలితో నెట్టుతూ లోపల చూశాడు. ఎవరో వున్నారు. వున్నవాళ్ళు ఆదరాబాదరా దేనికోసమో వెదుకుతున్నారు. కొన్నివస్తువులు చెల్లా చెదరుగా పడివున్నవి.

సూరి గుండెలు వేగంగా కొట్టుకున్నై.

లోపలున్నది ముగ్గురు. ముగ్గురూ వుద్దండుల్లాగున్నారు. వాళ్ళ శరీరాలు అతిబలశాలురని చెప్పకనే చెప్తున్నై. అయినా ధైర్యంచేశాడు సూరి.

మెల్లగా తలుపుకొట్టాడు మునివ్రేళ్ళతో. నిశ్శబ్దం. మళ్ళీ తట్టాడు.

కాసేపటికి తలుపు తెలుచుకుంది. తెలుచుకున్నదే తడవు ఒక చెయ్యి మెఱుపులా బయటకు రావడం, సూరి జుట్టుపట్టుకోవడం, లోపలకు లాగడం, తలుపులు మూయడం జరిగిపోయింది.

అంత క్విక్ గా వాళ్ళు వూనుకుంటారని సూరి వూహించలేదు.

సూరి శరీరాన్ని ధన్ ధన్ మని వాళ్ళపిడికిళ్ళు గుద్దుతున్నై. ఇనపగుండ్లు ఢీకొట్టు కుంటున్నట్టుంది. బాధను ఓర్చుకోలేక పోయాడు.

తన బలాన్నంతా కూడగట్టుకుని విసురుగాతిరిగాడు సూరి. ఆ విసురికి అతనిని పట్టుకున్నతని పట్టు సడలిపోయింది.

తృటిలో సూరి నిలబడి ఎదుర్కొన్నాడు.

కాని అతనిబలం వారిముందు చాల్లేదు. ఆకలిగొన్న బెబ్బులిలా చూచే చూపులు. ఒక్కసారి విరుచుకుపడి సూరిని అదిమి పట్టేశారు.

"ఎవరు నువ్వు?" గదమాయించి అడిగారు సింహ గర్జనతో.

4

యువరాజ్ తన సిట్రన్ కారుని హెడ్ క్వార్టర్ ముందా పాడు. క్రైమ్ బ్రాంచ్ డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ని కల్సు కున్నాడు. జరిగిన విషయాలను చెప్పాడు.

"ఇంతకీ సాబర్ ఏమైవుంటాడని??" అడిగాడు ధనార్జన రావు.

"నిర్ధారించుకోలేక పోతున్నాను. చంపబడి వుండాలి. సాబర్ చంపబడివుంటె శవం దొరకడం దుర్లభం. ఎందుకంటె అక్కడ సొరచేపలు తిరగడంజాస్తి. చేపలు సాబర్ శవాన్ని మింగేసి వుండొచ్చు" అన్నాడు యువరాజ్.

"ఒకవేళ అపహరించబడి వుంటే?"

"ఏదైనా పడవలో తీసుకువెళ్ళి వుండాలి."

"ఇంతకీ నన్నేం చేయమంటారు?" అడిగాడు ధనార్జన రావు.

"కాసరకొండవద్ద సాబర్ కారుంది. మీబలగాన్ని పంపి యింకా దర్యాప్తు చేయమనండి. సాబర్ ఎవరు? తెల్సుకోవ డానికి ప్రయత్నించండి" అని చెప్పి ఇంటికి బయలుదేరాడు యువరాజ్.

యువరాజ్ యింటికిరాగానే సూరి వ్రాసినది చూచి తనలోతాను నవ్వుకున్నాడు. సూరి హోటల్ ఎంపైర్‌కు వెళ్ళి సాబర్ని గురించి తెల్సుకుంటాడు.

తనిప్పుడు ఏంచేయాలి? సాబర్ కారులో మాజిక్ ప్రదర్శ

నకు టికెట్ వుంది. మాజిక్ ప్రదర్శన చూడడానికే టికెట్ కొన్నాడా? లేక అక్కడేదైనా గూడుపుఠాణీ వుందా? ఆలోచించి తను ఇంద్రజాలప్రదర్శనకు వెళ్లాలని నిశ్చయించు కున్నాడు.

ప్రదర్శన చేరుకోడానికి ముందు హోటల్ ఎంపైర్‌లో సూర్ని కల్సుకుని వెళ్ళాలనుకుని కారులో బయలుదేరాడు యువరాజ్.

కౌంటర్‌లో అడగగా సూరి వచ్చాడని తెల్సింది. పదవ నెంబరు గదికి బయలుదేరాడు.

సాబర్ గదిముందు నిలబడ్డాడు.

తలుపులు నెట్టాడు. తెరుచుకున్నవి.

లోపల ఎవరూ లేరు!!

గదంతా చిందరవందరగా వుంది.గదినంతటిని యువరాజ్ పరీక్షగా చూశాడు. ఎవరో దేనికోసమో వెదకిన సూచనలు వుండడమేగాక పోట్లాడుకున్న గుర్తులూ వున్నై.

కొంపదీసి సూరికేమైనా ప్రమాదం సంభవించిందా? ఇక్కడ ఏం జరిగి వుంటుంది?

సూరి ఏదైనా గుర్తు పెట్టాడేమో చూడాలని యువరాజ్ సాబర్ గదిని పరీక్షగా చూడడం ప్రారంభించాడు.

టేబుల్ మీద ఆరోమార్కు వుంది. మార్కుకి ఎదురుగా ఆర్ వ్రాయబడివుంది. అది సూరిపెట్టిన గుర్తేనని యువ రాజ్‌కు తెల్సు.

ఆర్ అంటే యెవరు? రాడీలా? యువరాజ్ వూహకంద లేదు. హోటల్ ఆవరణలో చూస్తే సూరి వోక్స్ వాగన్ కారులేదు. అంటె దుండగులను కారులోనే అనుసరించి ఉండాలని యువరాజ్ అనుకున్నాడు.

5

"నా స్నేహితుడొకడు ఢిల్లీనుండి వచ్చాడు. ఈ హోట

లులో బస చేసినట్టు చెప్పాడు. ఏ గదిలో వుందీ కౌంటరులో అడిగితే ఒకే పేరుగల వ్యక్తులు ఇద్దరున్నారు. ఏ నెంబరో తెలియక చూస్తున్నాను. ఈ గదికి తాళం వేయబడిలేదు. అందుకని'' నసిగాడు సూరి.

"నిజంగానా?'' ఒకడు ఉరిమాడు.

"అక్షరాలా!'' బిక్క మొఖం పెట్టాడు సూరి.

సూరిని వదిలిపెట్టి, "జాగ్రత్త! ఈ విషయం ఎవరితో నైనా చెప్పావా ఛస్తావ్!'' అన్నారు వాళ్ళు.

"మీరెవరండీ?'' అమాయకంగా అడిగాడు సూరి.

"ఎవరైతే నీకెందుకు...! రండ్రా!'' అంటూ అందరూ బయటకి వెళ్ళిపోయారు.

వాళ్ళను చూస్తూంటె రౌడీల్లాగున్నారు. వాళ్లు ఈ గదిలో దేనికోసమో వెదికివున్నారు. రహస్యానికి, వీరికి సంబంధ ముంది. వాళ్ళని నీడిలా వెంటాడాలని నిశ్చయించుకున్నాడు సూరి.

గబగబా బాల్ పాయింట్ కలాన్ని అందుకుని ఆరో మార్క్ పెట్టి ఆర్ వ్రాశాడు. యువరాజ్ వస్తే చూస్తాడని సూరికి తెల్సు.

ఆదరాబాదరా సూరి బయటకు వచ్చాడు.

ఆ ముగ్గురు ఒక కారులో ఎక్కడం చూచాడు. సూరి తన వోక్స్ వాగన్ కారెక్కి బయలుదేరాడు. వాళ్ళ కారుని దృష్టిలో పెట్టుకుని అతిజాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నాడు.

రౌడీలున్న కారుసాఫీగా వెళ్తోంది. ఆ కారు యెటు తిరిగితే సూరి తనకారునికూడా అటు మళ్ళిస్తున్నాడు. ఆ కారు స్పీడందుకుంది.

సూరికి అనుమానం కల్గింది. తనకారు అనుసరించడం ఆ రౌడీలు పసిగట్టి వుండాలని అనుకున్నాడు. అయినా వదలి

పెట్టలేదు.

చాలాదూరంలో పొగలు కనబడినవి. పొగల చుట్టూజనం గుంపుగా చేరివున్నారు.

రాడీలున్న కారు వేగంగాపోతూ జనాన్ని దాటుకుని ఆవైపుకు వెళ్ళిపోయింది. సూరి కారు జనాన్ని చేరుకుంది.

నడిరోడ్డుమీద ఒక కారు తగులబడి పోతూంది. సూరి ఆదరాబాదరా దిగాడు. తగులబడే కారుని చూచాడు.

అది అంబాసిడర్ కారు. ఆకుపచ్చరంగు, ఎం. ఎస్. వై 88008!!

ఎవరిదాకారు? ఎందుకు తగులబడుతూంది? గుంపులో ఒకర్ని ప్రశ్నించాడు సూరి.

"ఏమోనండి! ఆకారుఎవరిదైంది తెలియదు. అది ఎలాతగుల బడుతూందో తెలియదు.తగుల బడుతూంటే. చూస్తున్నాం" అన్నాడొకడు

సూరి ఇంకా మరిటి యిద్దర్ని ప్రశ్నించి చూశాడు. అది ఎలా తగులబడుతూందో ఎవరికీ తెలియదు. కారులో ఎవరూ లేరు. ఖాళీకారు మండిపోతూంది. సూరి ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది

జనం లేనపుడు కారులోనుండి దిగిపోతూ కారుని తగుల బెట్టడం సులభమే! అయితే ఆపని ఎవరు చేశారు? కారుని తగులబెట్టవలసిన అవసరం ఎందుకొచ్చింది?

ఆ సమయానికి అక్కడికి యువరాజ్ వున్న సిత్రన్ కారొచ్చి ఆగింది.

గబగబా సూరి యువరాజ్ ని చేరుకున్నాడు. జరిగినది చకచకా చెప్పాడు.

మండిపోయే కారుని చూడగానే యువరాజ్ ఆశ్చ ర్యానికి అంతులేకుండా పోయింది. అది సాబర్ కారు!!

యువరాజ్ కారులోవున్న ట్రాన్సిస్టర్ టెలిఫోన్ ని

అందుకని ధనార్జనరావుకు ఫోన్ చేశాడు.

"మిస్టర్ ధనార్జనరావ్! మీ పోలీసులు కాసరకొండవద్ద ఏవైనా విషయాలు తెల్సుకున్నారా?" అడిగాడు.

"అక్కడ మీరు చెప్పినట్టు కారులేదు. మరేవిధమైన అనుమానాస్పద విషయాలు లభించలేదు," అన్నాడు ధనార్జనరావు.

"సాబర్ కారు యిక్కడి తగులబడి పోతూంది..."

"మైగాడ్! యిప్పుడే వస్తున్నాను."

"ఏమిటిసార్! విచిత్రంగావుంది" అన్నాడు సూరి.

"అవును సూరీ, ఈకారు సాబర్ది. కాసరకొండవద్ద వుడడం నాకళ్ళారా నేను చూశాను. ఇక్కడికెలావచ్చింది?"

"దుండగులే తెచ్చివుంటారు."

"నిజం!"

"సాబర్ ఇండియాకువచ్చి నాల్రోజులే అవుతూంది. అటువంటతనికి కారు ఎలా వచ్చింది?" అన్నాడు సూరి.

"హోటల్ ఎంపైర్కు వచ్చి నాల్రోజు లవుతూంది. సాబర్ ఇంతకుముందు ఎక్కడైనా వున్నాడేమో?" అన్నాడు యువరాజ్.

"అదీ సంభవమే. దానిని గురించి నేను తెల్సుకోలేదు."

"ఫరవాలేదు. నువ్వు యీ కారు ఎవరిదైంది ఆరాతీయ్. నువ్వన్నట్టు సాబర్ ఇండియాకు వచ్చి నాల్రోజులే అయితే ఈకారుని అతనికి స్నేహితు లెవరైనా యిచ్చివుండాలి. స్వంతమైనదైతే సాబర్ ఇండియాలో చాల్రోజులనుండి వుండాలి. సాబర్కు ఏదో రహస్యం తెల్సు. ఆ రహస్యాన్ని తెల్సుకోడానికి ఎవరో గట్టిగా ప్రయత్నిస్తున్నారు. సూరీ మాజిక్షోకు టైం అయింది. వెళ్తున్నాను. ధనార్జనరావు రాగానే జరగవల్సిన పనులు చూడు" అంటూ యువరాజ్ కారెక్కాడు.

యువరాజ్ తన సిత్రన్ కారుని మాజిక్ షో జరుగు స్థలంవద్ద ఆపాడు.

అక్కడ రకరకాల కార్లు అనేకం ఆగివున్నవి.

లోపల పిన్నలు, పెద్దలు, యువకులు, యువతులు, స్త్రీ పురుషులు బాగా రద్దీగా వున్నారు. యువరాజ్ తనసీటులో కూర్చున్నాడు.

ప్రదర్శన ప్రారంభమైంది.

వారంట్ ని పరీక్షగా చూశాడు యువరాజ్. ముప్ఫైఏళ్ళకు మించని వయసు. పొడుగుకు తగినలావు. తెల్లటి శరీరం. బూడిదరంగు వెంట్రుకలు. పిల్లికళ్ళు. లావుగావున్న ముక్కు. దళసరి పెదాలు.

వారంట్ తన ఇంద్రజాల ప్రదర్శనను కొనసాగించాడు. ఒకమనిషి తల నఱకడం, నఱికిన తలను అందరికీ చూపడం ఆశ్యాద్భుతంగా వుంది.

తఱువాత ఒక గ్లాసునుండి ఆవైపునుండి ఈవైపుకు అవలీలగా రావడం, మనిషిని మాయం చేయడం. అతని పనులు అత్యంత అద్భుతంగా వున్నై.

యువరాజ్ ఆశ్చర్య చకితుడై తననితాను మఱచిపోయి ప్రదర్శనను తిలకిస్తున్నాడు. ప్రేక్షకులమధ్య నిశ్శబ్దం తాండవమాడుతోంది. వారంట్ చూపే ఇంద్రజాలం గగుర్పాటు కలుగుతోంది.

ఒకబాయిని పందిగా మార్చాడు. పందిని ఏనుగుగా చేశాడు. ఏనుగు ఘీంకరిస్తూ తన తొండమును అటుయిటు ఆడిస్తోంది. ప్రేక్షకులు వూపిరి వుగ్గబట్టి చూస్తున్నారు.

హఠాత్తుగా ఏనుగు మాయమయింది. ఆ చోట రాయి వుంది. అతనిలోని విద్యను యువరాజ్ కొనియాడకుండా వుండలేకపోయాడు.

క్లాప్స్ దద్దరిల్లిపోతూంది. యువరాజ్ చేతులు తట్టకుండా

వుండలేకపోయాడు. ఇంకా వింత వింతగా వారంట్ తన విద్యలను ప్రదర్శించాడు. ప్రదర్శన ముగిసింది. అందరూ తమతమ యిళ్ళకు వెళ్ళే సందడిలో పడిపోయివున్నారు.

యువరాజ్ వారంట్ వున్న గదివైపు బయలుదేరాడు.

అక్కడున్న ప్రజను చూచి ఆశ్చర్యపోయాడు. దాదాపు నలభైమంది దాకా వున్నారు. అందరూ వారంటును దర్శించి అభినందనలు తెలుపాలనుకున్నవారు! కొందరు ఆటోగ్రాఫ్ తీసుకోవాలని కాచుకుని వున్నారు. అక్కడున్నవారే గాక యింకా చాలామందివచ్చి గుమిగూడుతున్నారు. అక్కడున్న వారంతా నిలబడి వారంట్ రాకకై ఎదురుచూస్తున్నారు.

వారంట్ పెద్దగా విష్ చేస్తూ వచ్చాడు. అతడ్ని యువరాజ్ నఖశిఖపర్యంతము చూశాడు. ఉత్సాహం వుట్టిపడే చూపులు. చురుకుదనం గల శరీరం. మనసు విప్పి నవ్వుతూ కొందరికి షేక్‌హాండ్ ఇస్తూ వస్తున్నాడు. కొందరికి ఆటోగ్రాఫ్‌లో సంతకం పెట్టున్నాడు.

వారంట్ సంతకం పెట్టేటప్పుడు ఎవరో ఒకతను అతని ప్రక్కగా వెళ్ళి నిలబడ్డాడు. అతను బ్రౌన్ సూటింగులో వున్నాడు.

బ్రౌన్ సూటతను వారంట్ చెవులో ఏదో చెప్పడం యువరాజ్ గమనించాడు. యువరాజ్ కంక చూశాడతను. యువరాజ్ గుండెలు ఝల్లుమన్నవి.

అంతమందిలో బ్రౌన్ సూటతను తనని ఎందుకు చూస్తున్నాడు.

వారంట్ కూడా యువరాజ్‌ని ఎగాదిగా చూశాడు. యువరాజ్ అనుమానం ధృఢపడిపోయింది. దాదాపు యాభై మంది జనంలో తనని గుర్తుగా చూస్తున్నారంటే విశేషం ఉంటుంది. తను తెల్సుకోవాలి.

అక్కడున్న వారందరికీ షేక్‌హాండ్ ఇస్తూ పరామర్శిస్తూ

వారంట్ యువరాజ్ వద్ద కొచ్చాడు. యువరాజ్ అభినందిస్తూ వారంట్ కు చెయ్యినందించాడు.

"మీ రెవరు?" అడిగాడు వారంట్.

"యువరాజ్?"

"ప్రయివేట్ డిటెక్టివ్??"

"యస్!"

"నన్ను అభినందించడానికి వచ్చినందుకు థాంక్స్!" అంటూ వారంట్ చేతులు కలిపాడు.

"మీతో ఏకాంతంగా మాట్లాడాలి," అన్నాడు యువరాజ్.

"చూశారా ఎందరున్నారో...!ఇపుడు వీలుపడదు" వినయంగా చెప్పాడు వారంట్.

"ఎప్పుడు కల్సుకోమంటారు."

"మూడు రోజుల తరువాత రండి," అంటూ వారంట్ మిగతా వాళ్ళని పలకరిస్తూ వెళ్ళాడు.

ఇక అక్కడుండీ లాభంలేదు. మూడు రోజుల వరకు గడువు ఎందుకు చెప్పాడో యువరాజుకు అర్థంకాలేదు. ఇంకెక్కడైనా ప్రదర్శన యివ్వవల్సి వుందా? ఏమో?

యువరాజ్ చకచకా బయటకు వచ్చాడు. చెవర్లెట్ కారాగివుంది. ఆ కారుని చూడగానే వారంట్ దై ఉంటుందని వూహించాడు. కారు డ్రైవర్ అక్కడే వున్నాడు. డ్రైవర్ని పలకరించాడు యువరాజ్.

"డ్రైవర్ మీ వారంటుకి వివాహమైందా?" ప్రశ్నించాడు యువరాజ్.

"అయింది. కానీ మూడు ఘంటలకే విడాకులు యిచ్చేశాడు," చెప్పాడు డ్రైవర్.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు యువరాజ్.

"నాకు తెలియదు సార్! వారంటుని పెళ్ళాడి, వెంటనే

విడాకులిచ్చింది సోనియా. ఎందుకో సోనియాను అడిగితే తెలియవచ్చు," అన్నాడు డ్రైవర్.

"సోనియా అడ్రస్ నీకు తెల్సా?"

"ఆఁ తెల్సు. నెంబరు డెబ్బై, బహదూర్ స్ట్రీట్!"

యువరాజ్ యింకేదో అడగబోయాడు. అక్కడికి మూకుమ్మడిగా జనం విరుచుకు పడ్డారు. జనాన్ని అదుపులో పెట్టడానికి, పోలీసులు ఇతర సిబ్బంది తంటాలు పడడంతో ఆ ప్రదేశమంతా గందరగోళం అయిపోయింది. ఇక లాభం లేదనుకుని యువరాజ్ బయలుదేరాడు.

6

"కారు సంగతి ఏమైంది?" అడిగాడు యువరాజ్.

"ఆ కారు అదే హోటలులో ఉంటున్న గుప్తా అనే అతను ఇచ్చివున్నాడు. సాబర్ అడిగాడట. గుప్తా ఇచ్చాడు. కారు గుప్తాదేనని ట్రాఫిక్ అండ్ లైసెన్సింగ్ డిపార్టు మెంటులో తేలింది," అన్నాడు.

"సాబర్ గురించి గుప్తా ఏదైనా చెప్పాడా?"

"అత్యవసరమైన చోటుకి వెళ్ళాలని, టాక్సీలో వెళ్ళడం మంచిదికాదని, కారు అడిగినట్టు గుప్తా చెప్పాడు. అంతే... సాబర్ గురించి మరేమీ చెప్పలేకపోయాడు," అన్నాడు సూరి.

"సాబర్ ఎవరైంది తేలిందా?"

"విలాస యాత్రికుడిగా హాంగ్ కాంగ్ నుండి వచ్చి వున్నట్టు దర్యాప్తు మూలంగా తేలింది."

"కాసర కొండవద్ద మరేవైనా విషయాలు తెల్సాయా?"

"లేదు. కానీ ఆవైపు సముద్రంలో ఒక మోటర్ బోట్ తిరుగాడుతూ ఉండడానికి ప్రత్యక్షసాక్ష్యాలు లభించాయి."

"ఆ బోట్ ని గురించి ఏదైనా...??"

"ధనార్జనరావు ప్రయత్నించాడు గానీ లాభంలేక

పోయింది. బోట్ ఏ యితర దేశాలకో వెళ్ళి ఉండాలని ధనార్జనరావు అనుమాన పడ్తున్నాడు.''

''కారు సాబర్‌ది కాదని తెల్సి ఎందుకు తగులబెట్టారు? గుప్తాకు యేదైనా సంబంధముందా? గుప్తా ఎవరైంది తెల్సుకున్నావా?'' అడిగాడు యువరాజ్.

''గుప్తా బెంగుళూరు నుండి వచ్చినవాడు. పెద్ద టింబర్ వర్తకుడు.''

''విమానాశ్రయంలో సాబర్ని గురించి విచారించావా?''

''ఆఁ... విలాస యాత్రికుడని తేలింది.''

''వీసాలో ఎన్నిరోజులుంది?''

''రెండు నెలలు.''

''సూరీ! నువ్వు హాంగ్ కాంగ్ వెళ్ళవలసి ఉంటుంది. హాంగ్ కాంగ్ వెళ్ళి సాబర్ గురించి పూర్తి భోగట్టా సేకరించుకు రావల్సి ఉంటుంది. వెళ్ళి రాగలవా?''

''రాగలను. మీరు?''

''నేను ఈ సోనియా గురించి, వారంట్‌ను గురించి తెల్సుకుంటాను. సాబర్ చెప్పబోయిన రహస్యమేమిటో వూహాకూ అందడంలేదు. సోనియా యింటికి వెళ్ళివుండే వాడ్ని. ఇంత అర్ధరాత్రిలో వెళ్ళడం యిష్టంలేక వచ్చాను.

''సాబర్ మనకేదో రహస్యం చెప్పడానికి గుప్తా కారులో వచ్చాడు. సాబర్ గదిని రౌడీలు వెదికివున్నారు. గుప్తాకారు కాసరకొండవద్దనుండి ఎవరో తెచ్చి నగరంలో తగులబెట్టుకున్నారు. సాబర్ కారులో మాజిక్ షో టికెట్ పడివుంది. వారంట్ సోనియాను వివాహమాడిన మూడుగంటలకే విడాకులు యిచ్చివున్నాడు. ఇవి జరిగిన విషయాలు. ఈ విషయాలను పెట్టుకుని ఏమి ఆలోచించినా అంతుచిక్కడంలేదు. అందుకే నువ్వు హాంగ్ కాంగ్ వెళ్ళడం వుచితమనిపించింది. సాబర్ ఎవరైంది తెలిస్తే మన దర్యాప్తు ముందుకు సాగు

తుంది."

"అలాగే సార్! వెళ్ళివస్తాను" అంటూ సూరి ఏరోడ్రోంకు ఫోన్ చేసాడు.

యువరాజ్ ఆలోచనలలో పడిపోయాడు.

7

తెల్లవారింది.

డిటెక్టివ్ లిద్దరూ డ్రెస్ చేసుకున్నారు. సూరి తన ప్రయాణానికి అవసరమైన దుస్తులను సూట్ కేసులో పెట్టుకుని సిద్ధమయ్యాడు. ఇద్దరూ బయటవచ్చి సిట్రన్ కారెక్కారు.

"సూరీ! మన యీ కేసుకు క్లయింట్ లేడు. ఖర్చులన్నీ మనవే! ఇప్పుడు నువ్వు హాంగ్ కాంగ్ వెళ్తున్నావు. అతి జాగ్రత్తగా మెలగవల్సి వస్తుంది. హాంగ్ కాంగ్ లో నేరాలు అధికం! దుష్టులు, దుర్మార్గులు జాస్తి. అక్కడ హత్యలు చేయడం గానీ, దౌర్జన్యం చేయడంగానీ సర్వసాధారణం. ఎవర్నీ నమ్మకు. నిన్ను ఒంటరిగా పంపడం నాకు బాధగానే వుంది. బికేర్ ఫుల్!" అని హెచ్చరించాడు యువరాజ్.

"యస్ సార్! అక్కడ సాబర్ని గురించి తెల్సుకోగానే వెంటనే తిరుగ ముఖం పట్టాను," అన్నాడు సూరి.

సిట్రన్ విమానాశ్రయం చేరుకుంది. సూరి, యువరాజ్ కళ్ళల్లోకి చూస్తూ వీడ్కోలు అందుకున్నాడు.

యువరాజ్ తన సిట్రన్ కారుని మళ్ళించాడు.

సిట్రన్ నెం 70, బహదూర్ స్ట్రీట్ లో ఆగింది.

యువరాజ్ దిగి సోనియా ఇంటిని చూశాడు. చాలా చిన్న ఇల్లు. పాతది కూడాను.

లోపలవున్న సోనియా అప్రయత్నంగా యువరాజ్ ని చూసి, "ఎవరండి? ఎవరు కావాలి?" అడిగింది గౌరవంగా.

సోనియాను చూచి చూడగానే ఆంగ్లో ఇండియన్ అని

అనుకున్నాడు. తెల్లటి దేహచ్ఛాయ. జామపండులాగున్న బుగ్గలు. రంగు పూసుకున్న పెదాలు. తీర్చి దిద్దిన కనుబొమలు. జేగురురంగులోవున్న కత్తిరించిన జుట్టు. చెవులకు రింగులు. గులాబీరంగు మెడ. ఎత్తైన వక్షస్థలం. సన్నటి నడుం. హైహీల్స్ చెప్పులు. ఎడం చేతికి రిస్ట్ వాచ్. గోళ్ళకు రంగు. మొత్తానికి మిరుమిట్లు గొల్పే అందం.

"మిస్ సోనియా...??"

"యస్ కమిన్..." అన్నది సోనియా. ఆమె స్వరంలో తియ్యదనం పలికింది.

యువరాజ్ లోపల ప్రవేశించాడు. చిన్న ఇల్లైనా చక్కగా పొందికగా డెకరేట్ చేసిన కొద్దిపాటి ఫర్నీచర్. గోడలకు ఏసుక్రీస్తు పటాలు వ్రేలాడుతున్నై.

"సిడౌన్!" అంది సోనియా.

యువరాజ్ కుర్చీలో కూర్చున్నాడు.

"టీ ఆర్ కాఫీ?" అడిగింది సోనియా.

తను ఎవరైంది తెల్సుకోకనే, తను ఎందుకు వచ్చింది అడగకనే మర్యాద యివ్వడం ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటె ఆ సమయం ఉదయం!!

"టీ యివ్వండి చాలు," అన్నాడు యువరాజ్.

"ఓ. కె. అలాగే" నవ్వుతూ కిచెన్ రూమ్‌లోకి వెళ్ళింది. రెండు నిముషాల్లో టీతో ప్రత్యక్షమైంది. ట్రేలో రెండు కప్పులున్నై. ట్రేని టీపాయ్‌మీద వుంచింది. యువరాజ్‌కు ఒకటి అందించింది. తను ఒకటి తీసుకుని సిప్ చేసింది సోనియా. యువరాజ్ కూడా టీని చప్పరించాడు. చప్పరిస్తూ సోనియా అందాన్ని చూస్తున్నాడు.

సోనియా టీని తాగుతూనే "నాతో ఏం పని? ఎందుకు వచ్చారు? మీ రెవరు?" అడిగింది.

యువరాజ్ ఆమెను అడగడానికి టీని గడగడ తాగేశాడు. కప్పుని టీపాయ్ మీదుంచుతూ, "నేను డిటెక్టివ్ యువరా..." పూర్తిగా చెప్పేలోపునే అతను కుర్చీలో తల వాల్చేశాడు.

సోనియా యువరాజ్ తలపట్టుకుని అటుయిటు ఆడించి చూచింది. స్పృహ పోయిందని నమ్మకం కుదిరిన మీదట తన రెండు చేతులతో చప్పట్లు కొట్టింది.

కిచెన్ రూములో దాగి వుండిన ఇద్దరు వ్యక్తులు యువరాజు కిరువైపులా వచ్చి నిలబడ్డారు.

"కమాన్! క్విక్," అరిచింది అదిరే పెదాలను అదుపులో పెట్టుకుంటూ సోనియా.

ఇద్దరిలో ఒకడు కిచెన్ రూమ్‌లో కెళ్ళాడు. అక్కడ ఒక పెద్ద పెట్టెవుంది. ఆ పెట్టె బలంగావుంది. చెక్కతో తయారు చేయబడినదైనా ఇనుప చట్రాలతో స్ట్రాంగ్‌గా వుంది. ఆ పెట్టెను అతను బలవంతంగా యువరాజ్ వద్దకు తెచ్చాడు.

పెట్టెను తెరచాడు. ఇద్దరూ కల్సి యువరాజ్‌ని ఆ పెట్టెలో వేశారు. పెట్టె మూత వేసి, పెద్ద తాళం కప్పను తగిలించారు. ఒకడు బయటకు వెళ్ళి నిలబడ్డాడు.

నిముషంలో ఒక స్టుడిబేకర్ కారొచ్చి ఆగింది. ఆ కారు డ్రైవర్ దిగి గబగబ సోనియా ఇంట్లోకి వచ్చాడు. ముగ్గురూ కల్సి యువరాజ్ వున్న పెట్టెను ఎత్తుకొన్నారు.

ఆ పెట్టెను తీసుకొచ్చి స్టుడిబేకర్ కారు డిక్కీలోకి ఎక్కించారు. ముగ్గురూ కారులో ఎక్కి కూర్చోగానే కారు బయలుదేరింది.

సోనియా ఆ కారు వెళ్ళేంతవరకు ఇంట్లోనేవుంది. వాళ్ళు వెళ్ళగానే యువరాజ్ సిట్రన్ కారును తీసుకెళ్ళి ఒక నిర్జన ప్రదేశంలో వదిలి వచ్చింది.

8

విమానాశ్రయంలో సూరి ఎంక్వైరీవైపు అడుగులు వేస్తున్నాడు.

ఆ సమయంలో సూరికి 'కెవ్వు' మంటూ ఒక గొంతు వినబడింది. ఆ గొంతు అపాయంలో వున్నప్పుడు అరచినట్టుంది.

సూరి కంగారుగా తిరిగి చూశాడు. ఏమీ కనబడలేదు. మళ్ళీవినబడింది. నోరుని నొక్కేటపుడు మూల్గినట్టు వినబడింది.

సూరి ఆదరాబాదరా బయటకు వచ్చాడు. యువరాజ్ సిత్రన్ స్పీడందుకుని వెళ్తోంది. కారు పార్కింగ్‌లో ఒక కారు ఆగివుంది. ఆ కారులో ఎవడో ఒక యువతిని వెనుక సీటులో నొక్కిపెట్టున్నాడు. ఆ యువతి కాళ్ళు డోర్‌గుండా బయటకువచ్చి గిజగిజ తన్నుకుంటున్నై.

సూరి గుండెలు అదిరాయి. ఎంత ధైర్యం! ఇంత పబ్లిక్ ప్రదేశంలో... మైగాడ్, "రేయ్" అరుస్తూ కారుని సమీపించాడు సూరి. "ఏమిటీ అక్రమం?" అన్నాడు క్రోధంగా.

"నీ కెందుకు? బుద్ధిగా వెళ్ళు" కోపంగా కారులో వున్నతను చెప్పాడు.

సూరి కోపాన్ని అణుచుకోలేకపోయాడు. యువరక్తం ఉరకలు వేసింది. పిడికిళ్ళు బిగించాడు. తటాలున డోర్ తెరచాడు.

డోర్ తెరవగానే సూరిని వెనకనుండి ఎవరో లోపలకు నెట్టేశారు.

సూరి విరుచుకుని లోపలున్న యువతిమీద పడిపోయాడు. సూరి పడీపడగానే ఆ యువతి ఇరికించి పట్టుకున్నది. సూరి లేవలేకపోయాడు.

ఆ యువతి మెత్తటి శరీరం, సెంటు వాసన గుప్పుమంది.

అప్పటికే నూరి తలమీద బరువుగా యేదో పడింది. కప్పగా ఆ యువతిమీద అలాగే వాలిపోయాడు.

ఆ సంఘటనను అక్కడెవరూ తిలకించలేదు. అందుకు అవకాశం లేకపోయింది.

9

స్టుడిబేకర్ కారు సుమారు రెండు గంటలసేపు ప్రయాణించి, కాసర కొండను దాటుకుని ఓ మైలుదూరం వరకు వెళ్ళింది. ఒక నిర్జన ప్రదేశంలో ఆగింది.

కొండల మధ్యకు సముద్రతీరం చొచ్చుకు వచ్చివుంది. రహస్య ప్రదేశంలో ఒక మోటర్‌బోట్ ఆగివుంది.

కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు యువరాజ్ వున్న పెట్టెను అతిశ్రమమీద, జాగ్రత్తగా రాళ్ళమధ్యగుండా, పొదలగుండా బోట్‌వరకు మోసుకెళ్ళారు.

పెట్టెను బోటులోకి ఎక్కించారు.

బోట్‌లోకి ఇద్దరు వ్యక్తులు ఎక్కారు.

మూడవ వ్యక్తి స్టూడిబేకర్‌వద్ద కొచ్చి కారుని కదిలించాడు.

బోట్ సముద్రంలోకి ఉరికింది. వేగం అందుకుంది. హోరు పెట్టుకుంటూ, సముద్రపు అలలను చీల్చుకుంటూ ఒక గంటసేపు ప్రయాణం కొనసాగించింది. చాలా దూరం వెళ్ళిపోయింది.

"రేయ్ బోటుని ఆపరా!" అన్నాడొకడు.

బోటుని ఆపాడు ఇంకొకడు. ఇద్దరూ కల్సి చుట్టూరా చూశారు. ఎటు చూసినా జలమయం. కెరటాలు. క్రిందకు నెట్టేసేంతటి గాలి! ఆ ఇద్దరు యువరాజ్ వున్న పెట్టెను పట్టుకున్నారు. మెల్లగా సముద్రంలోకి నెట్టేశారు. ఆ పెట్టె దబ్బున నీటిలో పడింది. మెల్లగా సముద్ర గర్భంలోకి జారు

ఉంటూంది. ఆ ఇద్దరూ తృప్తిగా గాలి పీల్చుకున్నారు.

బోటుని స్టార్టుచేశారు. పెట్టె సముద్రం అడుగుకి కొన్ని మైళ్ళలోతుకు వెళ్ళసాగింది.

10

సూరి కళ్ళు తెరిచాడు.

తల పగిలిపోయేటంతటి బాధ! వళ్ళంతా నీరసంగా వుంది. తలను తడిమి చూసుకున్నాడు. బొప్పి కట్టివుంది. లేచి కూర్చుని జరిగిందేమిటో గుర్తు తెచ్చుకున్నాడు. ఆశ్చర్యం, భయం కడకడలాడించాయి.

తనని హాంగ్ కాంగ్ వెళ్ళకుండా దుర్మార్గులెవరో అటకాయించి వున్నారు. ఎందుకు? ఏదో బలమైన కారణం వుండి ఉంటుంది. తను హాంగ్ కాంగ్ వెళ్ళితే శత్రువుల ఉనికి తెలుస్తుందని భయపడి ఉండాలి.

తను హాంగ్ కాంగ్ వెళ్ళనున్నట్లు శత్రువులకు యెలా తెల్సింది? తన సంగతి తెల్సుకున్న దుండగులు యువరాజ్ ని గురించి తెల్సుకుని ఉండరా? యువరాజుకు ఏదైనా ప్రమాదం సంభవించి ఉంటుందా?

తమ పరిశోధనలలో తెల్సుకున్నదేమీ లేదు., సాబర్ని గురించి తెల్సుకోడానికి ప్రయత్నం ప్రారంభమైంది. అంత మాత్రానికే శత్రువులు ఎందుకు భయపడుతున్నారు?

ఆ చోటునుండి బయట పడడానికి ఏదైనా మార్గం గోచరిస్తుందేమో వెతకడం ప్రారంభించాడు.

ఆ గది చాలా బందోబస్తుగా ఉంది. తలుపులు, కిటికీలు బలంగావున్నై. తనని ఎందుకు బంధించారో అంతుపట్టడం లేదు. తన మూలంగా శత్రువులకేదైనా లాభం ఉందా?

కొన్ని గంటలు గడిచినై.

తలుపు తెఱచే చప్పుడు వినబడింది. సూరి శరీరం జలద

రించింది.

ఒకతను లోపలకు వచ్చాడు. అతని వెనకాలే మరి ఇద్దరు వచ్చారు.

ముగ్గురూ దున్నల్లాగున్నారు. కరడుగట్టిన శరీరాలు. గళ్ళ లుంగీలు. రంగుబనియన్లు. వెడల్పాగావున్న బెల్టులు. బెల్టుల్లో కత్తులు. భారీ శరీరాలు. కండలు తిరిగిన వళ్ళు. నిప్పులు క్రక్కే చూపులు. పేరుమోసిన రౌడీల్లాగున్న ఆకారాలు.

వారి రూపాలు సూరికి భయంగొల్పినాయి. వారిని ఎగాదిగా చూశాడు. ఇంతలో ఇంకో అతను వచ్చాడు.

అతను టిప్ టాప్ గా డ్రస్ చేసుకుని వున్నాడు. ఇస్త్రీ మడతలు చెరగని దుస్తులు. ఫాషన్ గా దువ్వుకున్న వెంట్రుకలు. టాయ్ లెట్ చేసుకున్న ముఖం. పొడవుకు తగిన లావు. లావుకు తగిన గంభీరం, ఠీవి, దర్పం వుట్టిపడే చూపులు.

రౌడీలు ముగ్గురూ హోటల్ ఎంపైర్ లో తనని వదలి పెట్టినవారు!!

"ఏయ్ మిస్టర్! ఎవరు నువ్వు?" అడిగాడు గంభీరంగా వున్న వ్యక్తి.

"తెలియకనే నన్నిక్కడకు తెచ్చావా?" వెటకారంగా అన్నాడు సూరి.

"అవును. తెలియకనే నిన్ను తెచ్చాను. ఇప్పుడు చెప్పు. ఎవరు నువ్వు?" అడిగాడతను.

"నీకు చెప్పడం అనవసరం" అన్నాడు సూరి కోపంగా.

అతను తన బూటుకాలితో ఈడ్చి తన్నాడు. భరించలేని బాధ! సూరి క్రిందపడి మూలిగాడు.

సూరి ఉడుకు రక్తంతో వూగిపోయాడు. మళ్ళీ తన్నడానికి అతను కాలెత్తాడు. ఆ కాలుని గురిపెట్టుకుని కాచుకునివున్న సూరి కాలు దగ్గరకగానే మెరుపులా పట్టుకోవడం

విద్యుచ్ఛక్తి వేగంతో మెలితిప్పేయడం చేశాడు.

బాధతో అతను అరుస్తూ దభేలున పడిపోయాడు.

రౌడీలు ఆశ్చర్యచకితులై సూరిమీదకు ఏకకాలంలో విజృంభించారు. సూరి స్ప్రింగులా గెంతాడు. ఢీకొన్నాడు. అటువంటి రౌడీలకు భయపడే స్వభావం లేదతనికి. ఎన్నో విద్యలలో వృత్తిరీత్యా శిక్షణ పొందినవాడు.

సూరి ఖడ్గమృగంలా విజృంభించాడు. తెగిన ఆనకట్టలా అతనిశక్తి పరవళ్లు త్రొక్కింది. ముగ్గురు రౌడీలూ సూరి ముందు తన్నుకలాడిపోయారు. శక్తివుంటే ప్రయోజనంలేదు. అందుకు తగిన యుక్తీ వుండాలి. ఆ గదంతా ధన్ ధన్ మని అదిరిపోతూంది.

సూరి మెలిపెట్టడం మూలంగా క్రిందపడ్డతను నెప్పితో లేవలేకపోయాడు. సూరి విజృంభణకు ఆశ్చర్యచకితుడై జేబులో చెయ్యిపెట్టి పిస్తోలు బయటకు తీశాడు. గురిపెట్ట బోతున్నాడు.

సూరి అది గమనించి ఆలస్యం చేయలేదు. ఆ వ్యక్తిమీద విరుచుకుపడిపోయాడు. సూరి భారానికి అతని గుండెలు అదిరిపోయాయి.

సూరిని వెనకనుంచి రెండు ఇనుపహస్తాలు యిరికించి పట్టేసినై. కదలలేకపోయాడు.

వెంటనే ఆ ముగ్గురు రౌడీలు తమ బెల్టులలోవున్న కత్తులను దూసి సూరిమీదకు మదపుటేనుగుల్లా పడిపోయారు.

ఇక తను బ్రతకడం కష్టం. వాళ్ళు తన శరీరాన్ని కత్తులతో తూట్లుచేస్తారు. కత్తులు దగ్గరయ్యాయి.

కళ్లుమూసుకున్నాడు సూరి.

11

పెట్టెలోవున్న డిటెక్టివ్ యువరాజ్ మెల్లగా కళ్ళు తెరచాడు. చీకటిగావుంది. ఏమీ కనిపించడంలేదు. కదల

బోయాడు. 'ధన్'మని తల కొట్టుకుంది. అప్పుడు గ్రహించాడు తను ఒక పెట్టెలో వున్నాడని!!

కదలకుండావుండి గమనించాడు. పెట్టె అంతా చల్లగా వుంది. భయంకరమైన నిశ్శబ్దంగావుంది. పెట్టె చాలా కొద్దిగా అటుయిటు వూగడం పనిగట్టాడు యువరాజ్. అంటే??

పెట్టె క్రిందకు దిగుతూండాలి. ఎక్కడికి??

అర్థమైపోయింది. నీటిలో దిగుతూంది. నీటి అడుగుభాగమైన పూడిక (నేల) తగిలేవరకు పెట్టె దిగుతుంది. తన అదృష్టం పెట్టెలోకి నీళ్ళు జొరబడలేదు. ఈ పెట్టెను బావిలో పడేశారా? ఏదైనా చెరువులో పడవేశారా? ఏదైనా కాల్వలోకి నెట్టారా?

కాలువలోకైతే పెట్టె దొర్లి వుండాలి. లేదా పొర్లి వుండాలి. అలా జరగలేదు. కనక కాలువకాదు. బావిలోనా? బావిలో అయినా, చెరువులో అయినా పెట్టె యింతసేపు దిగివుండదు. ఈపాటికి నేల చేరుకుని వుండాలి. మరి?

సముద్రమా?? యువరాజ్ గుండెలు ఝల్లుమన్నవి.

ఆ పెట్టెను మింగేయగల చేపలు, ఇతర సముద్ర జంతువులు వుంటాయి. అలా మింగితే తను వాటి శరీరంలో జీర్ణంచుకుపోతాడు. ఏనుగును సైతము అమాంతం మింగేయగల చేపలున్నాయని యువరాజుకు తెల్సు.

పెట్టెలోవున్న యువరాజుకు చెమటలు పట్టేసినై. పైగా పెట్టెలో వుండిన ఆక్సిజన్ అయిపోయింది కాబోలు, వూపిరి తీసుకుంటూంటే శ్వాసకోశాలు యిబ్బందికి గురవడంస్పష్టంగా తెలుస్తూంది. గడగడలాడిపోయాడు.

పెట్టెమూత తెరవడానకి తన బలాన్నంతా వుపయోగించాడు. ససేమిరా కదలలేదు.

కాళ్ళతో చేతులతో ఆ పెట్టెను బాదితే, పెట్టె పగిలి

నీళ్లు జొరబడతాయి. నీళ్లు చేరితే వెంటనే మరణించి తీరుతాడు.

ముఖానికి పట్టిన చెమటను ఎడమచేతితో తుడుచుకున్నాడు. ఆ సమయంలో చేతి వ్రేలికున్న వుంగరం గరుగ్గా తగిలింది. అప్పుడు యువరాజుకు ఏదో గుర్తొచ్చింది. ఆదరాబాదరా వ్రేలికున్న ఉంగరాన్ని తీశాడు. కొంత ధైర్యం కల్గింది.

ఆ ఉంగరంలో మినిబాంబ్ వుంది. చాలా చిన్నదైనప్పటికి శక్తివంతమైనది. ఉంగరపురాయి ఉండవలసినచోట బాంబువున్నది. తన వృత్తిరీత్యా అటువంటి బాంబులు ఉపయోగపడతాయని దగ్గర ఉంచుకుని వున్నాడు. దాని జ్ఞాపకమే లేదు. కారణం అప్పుడు కల్గిన ప్రాణభీతి అటువంటిది.

మెల్లగా ఆ బాంబుని తీశాడు. పెట్టె పైభాగంలో అమర్చాడు.

బాంబు పేలితే పెట్టెలోవున్న తనకు ప్రమాదం సంభవించవచ్చు. ఆ బాంబు ఒకవైపుకు ఫోర్సుగా ప్రేలుతుందని తెల్సు. అయినా భీతిగానేవుంది.

బాంబుని ప్రేల్చివేశాడు.

తను గిరుక్కున బోర్లాతిరిగి పెట్టెకు అతుక్కుపోయాడు యువరాజ్. తన రెండు చెవులను గట్టిగా మూసుకున్నాడు.

“ఢాం!!”

యువరాజ్ క్షణమూ ఆలస్యం చేయలేదు. శబ్దంతో పాటు నెట్టుకుంటూ పైకిలేచాడు. పెట్టె పైభాగం పూర్తిగా నీటిలో కల్సిపోయింది. యువరాజ్ నీటిలోకి వచ్చేశాడు.

పైకి తేలడానికి చేతులను కాళ్ళను తన శక్తినంతటినీ ఉపయోగించాడు. యువరాజ్ రివ్వున పైకివస్తున్నాడు.

యువరాజ్ ఊపిరి బిగపట్టివున్నాడు. చేపలు తనని

మింగేస్తాయేమోనని భయంగావుంది. ఎంతదూరం పైకి తేలడానికి వెళ్ళాలి? పైకితేలేంతవరకు శ్వాసను బిగపట్టి వుండగలడా? కాలం గడుస్తూంది. యువరాజ్ సముద్ర గర్భంలో నుండి పైకివస్తున్నాడు.

యువరాజుకు శ్వాసను ఆపగలశక్తి క్షీణించిపోయింది. తనిక బ్రతకలేడని భయకంపితుడైపోయాడు. గాలి పీల్చని కారణంగా గుండెబాధకు గురైంది. హృదయం పగిలిపోతుందేమో నన్నంత ఎద్దడి ఏర్పడిపోయింది.

యువరాజ్ ఊపిరి బిగపట్టి ఉండలేకపోయాడు. ప్రాణాలుపోయే పరిస్థితి ఏర్పడింది. తప్పనిసరిగా కొద్దిగా సముద్రపునీటిని మింగాడు. తన యావత్శక్తినీ ఉపయోగించి పైకిరావడానికి ప్రయత్నించాడు.

గుటక వేయగానే వూపిరితిత్తులకు ఏదో శక్తి వచ్చింది. ఆ శక్తి ఉన్నంతలో పైకితేలి తీరాలి. లేనిచో మరికొన్ని గుటకలువేస్తే ప్రాణాలు పోతాయని యువరాజుకు తెల్సు.

12

“సార్! వైద్యనాధ అయ్యర్ స్ట్రీట్‌లో ఓరగా డిటెక్టివ్ యువరాజ్ గారి సిత్రన్ కారు ప్రొద్దుటినుండి ఆగివుంది. ఎవరూ రాలేదు” అన్నాడు బీట్ కానిస్టేబుల్.

“అక్కడంతా విచారించావా?” అన్నాడు ధనార్జనరావు కాస్త ఖంగారుగా.

“ఆఁ విచారించాను సార్. ఎవరో ఒక యువతి దిగి వెళ్ళడం కొందరు చూచినట్టు చెప్తున్నారు. కానీ ఆ యువతి ఆనవాలు చెప్పలేకపోతున్నారు,” చెప్పాడు బీట్ కానిస్టేబుల్.

ధనార్జనరావుకు అయోమయం అయిపోయింది. డిటెక్టివ్లిద్దరూ ఏమైనట్టు? తనకు ఏ విషయమూ చెప్పలేదు. ఫోనూ

చేయలేదు. కనబడనూలేదు. కారుమాత్రమే ఆగివుందంటే యువరాజ్ ఏమైయ్యాడు? సూరి ఏమైయ్యాడు? ధనార్జనరావు గుండెలు వేగంగా కొట్టుకున్నై.

"నేనక్కడకు వస్తున్నాను" అంటూ ఫోన్ని క్లిక్ చేసి యువరాజ్ యింటికి డయల్ చేశాడు. "యువరాజైనా, సూరైనా యింట్లోవున్నారా?" అడిగాడు ధనార్జనరావు.

"సూరిగారు హాంగ్ కాంగ్ వెళ్ళడానికి యువరాజ్ గారి సిత్రన్ కారులో బయలుదేరి యిద్దరూ వెళ్లారు" అన్నాడు నౌఖరు.

"సూరి హాంకాంగ్ వెళ్లాడా?! నాతో చెప్పనేలేదు" అంటూ తిరిగి ధనార్జనరావ్ విమానాశ్రయానికి డయల్ చేశాడు.

"నేను క్రైంబ్రాంచ్ నుండి మాట్లాడుతున్నాను. ఈ ఉదయం హాంగ్ కాంగ్ వెళ్లు విమానంలో సూరి అనే వ్యక్తి ప్రయాణించాడా తెల్సుకుని చెప్పాలి," అన్నాడు ధనార్జనరావు.

"జస్ట్ వెయిట్ ఆన్ ది లైన్!" అంటూ రెండు నిముషాలాగి, "లేదు సార్! సూరి అనే వ్యక్తి ప్రయాణించలేదు. విమానం బయలుదేరే సమయానికి గిరి అనే వ్యక్తి హాంగ్ కాంగ్ వెళ్ళివున్నాడు," అన్నా డవతలి వ్యక్తి.

"బాగా తెల్సుకునే చెప్తున్నారా?"

"అఁ ఖచ్చితంగా, కావాలంటే మీరొచ్చి చూచుకోవచ్చు."

"ఓయస్" అంటూ ఫోన్ రిసీవర్ పెట్టేశాడు. ఆలోచనలలో పడిపోయాడు. సూరి హాంకాంగ్ ఎందుకు వెళ్ళవలసి వచ్చింది? సూరి_గిరి అని పేరు మార్చుకుని ప్రయాణించాడా? లేక సూరికి బదులు గిరి అను శత్రువులలోని వ్యక్తి ప్రయాణించాడా?

ధనార్జనరావు వైద్యనాథ అయ్యర్ వీధికి తన జీపు కారులో బయలుదేరాడు. అంతదూరానికి సిత్రన్ కనబడు తున్నది. ఆ కారుప్రక్కనే తన జీపు నాపాడు. అక్కడుండిన బీట్ కానిస్టేబుల్ అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేశాడు.

"ఈ కారుని యిక్కడొదిలి వెళ్ళిన యువతిని గురించి ఫోటో సేకరించావా?"

"వీలుకాలేదు సార్!" నసిగాడు.

"ఈ చుట్టుప్రక్కల యిళ్ళల్లో విచారించావా?"

"విచారించాను సార్. ఈ వీథి నిర్మానుష్యంగా వుండడం మూలంగా కార్లోనుండి దిగిన యువతిని ఆ రెండు ఇళ్ళల్లోని వారు చూచారుగానీ సరిగా గుర్తించలేదట."

"ఊఁ... సరి ఆ జీపుని తీసుకుని నువ్వు హెడ్‌క్వార్టర్స్‌కు పద," అంటూ ధనార్జనరావు సిత్రన్ కారులోకి ఎక్కి కూర్చున్నాడు.

కారులో యువరాజ్ ఏదైనా గుర్తులు,ఆచూకీ తెలుప డానికి వదిలిపెట్టి వెళ్ళాడేమో పరీక్షించాడు. ధనార్జనరావు ఏమీ తెల్సుకోలేకపోయాడు. కారుని స్టార్టుచేశాడు. బయలు దేరింది సిత్రన్.

యువరాజ్ తనకు బాల్యస్నేహితుడేగాక, ప్రాణ మిత్రుడు కూడా. తలాతోక లేని కేసులో తలదూర్చి ప్రమా దానికి గురైపోయాడు. ఇపుడు తనేం చేయాలి? యువరాజ్ ఎక్కడ ఎలావుండేది తను తెల్సుకోవడం ఎలా? ఆలోచిస్తూ ధనార్జనరావు సిత్రన్ కారుని విమానాశ్రయానికి మళ్ళించాడు.

ఎంక్వైరీలో తన హోదాని ఉపయోగించి సూరిని గురించి విచారించాడు. గిరిని వాళ్లు వర్ణించి చెప్పారు. ఆ వర్ణన సూరికి సరిపోలేదు.

ఇంకా వివరంగా తెల్సుకొన్నాడు. మొత్తానికి సూరి

హాంగ్ కాంగ్ వెళ్ళలేదని తెల్చుకున్నాడు. సూరి ఏమై పోయాడు?

సిత్రన్ ఇక్కడకు వచ్చింది అంటె సూరిని డ్రాప్ చేసి వుంటుంది. దిగిన సూరి విమానం ఎక్కలేదు. కనక ఇక్కడే సూరికి శత్రువులకు ఘర్షణ జరిగివుండాలి. ధనార్జనరావు అలా వూహించి అక్కడ దర్యాప్తు ప్రారంభించాడు. అక్కడ ప్రతి ఒక్కర్ని ఇంటరాగేషన్ చేయడం ప్రారంభించాడు.

సూరిని ఒక కారులో బలవంతాన తీసుకెళ్ళిన సంగతి తెల్సుకున్నాడు. ఆ కారు ఎటు వెళ్ళింది? ఇక్కడనుండి యువరాజ్ ఎటు వెళ్ళాడు? ఓపిగ్గా విమానాశ్రయం నుండి విచారిస్తూ బయలుదేరాడు. మధ్యలో తన బలగానికి టెలిఫోన్ చేశాడు.

పోలీసులు ముమ్మరంగా కృషిచేశారు. చివరకు సిత్రన్ ఆగిన చోటు అయిన సోనియా యింటిని కనిపెట్టేశారు.

సోనియా యింటి తలుపులకున్న తాళం వెక్కిరించింది. ధనార్జనరావు సందేహించ లేదు. తాళాలు తీసి లోపల చూశాడు. ఖాళీగావుంది. అంతేకాదు. టు లెట్ బోర్డు తలుపులకు పైభాగాన ఉండడం చూడనందుకు నొచ్చుకున్నాడు.

సూరిని తీసుకెళ్ళిన కారు ఎటు వెళ్ళిందోకూడా ఎంత ప్రయత్నించినా తెల్సుకోలేకపోయారు.

13

"ఆగండి!" అరిచాడు క్రిందపడ్డతను.

సూరి కళ్ళు తెరచి అతన్ని చూశాడు. ముగ్గురు రౌడీలు క్రిందపడ్డ వ్యక్తివైపు చూశారు.

"అతన్ని చంపకండి. కాసేపు బ్రతక నివ్వండి" అంటూ నోటినుండి కారిన నెత్తురును తుడుచుకుంటూ, బాధను ఓర్చుకుంటూ మూల్గుతూ, మూల్గుతూ లేచి నిలబడ్డాడు.

"ఇకనైనా చెప్పు! ఎలాగూ చావబోతావు. చావడానికి ముందు నేనడిగిన ప్రశ్నలకు జవాబులివ్వు?" ప్రాధేయపూర్వకంగా వుందతని స్వరం.

"నువ్వెవరు? నీ పేరేమిటి?" అడిగాడు సూరి.

"నా పేరు సర్దార్!" అన్నా డతను.

సూరిని పట్టుకున్న రౌడీలు ఎప్పుడెప్పుడా అని వురుముతున్నారు. సూరి శరీరంలోకి దిగబడడానికి కత్తులు సిద్ధంగా వున్నై.

"నేను చెప్పడానికిముందు నన్నెందుకు బంధించి తెచ్చినావో చెప్పాలి," అన్నాడు సూరి.

"ఆఁ... నువ్వు హోటల్ ఎంపైర్‌లో పదవనెంబరు గదికి ఎందుకు వచ్చావు? వచ్చిన నువ్వు మా వ్యక్తులను ఎందుకు అనుసరించి వచ్చావు? సాబర్ని గురించి నీకేదైనా తెల్సునేమోనని నిన్ను బంధించవలసి వచ్చింది," అన్నాడు సర్దార్.

"నువ్వు చెప్పేది అబద్ధం! నేను విమానాశ్రయం వెళ్ళగానే సాబర్ని గురించి తెల్సుకోడానికి నేను హాంగ్ కాంగ్ వెళ్తున్నానని తెల్సుకుని బంధించావు," అన్నాడు సూరి.

"అవును. నీ బదులు నీలాటి వ్యక్తి హాంగ్ కాంగ్ వెళ్ళివున్నాడు. వెళ్ళినతను రేపో ఎల్లుండో రావచ్చు. సాబర్ని గురించి తెల్సుకోవడంలో నీ ఇంటరెస్ట్ ఏమిటి?" అడిగాడు సర్దార్.

"నేను డిటెక్టివ్ యువరాజ్ అసిస్టెంటు సూరిని!"

"నీవు యు. యు... యువరాజ్ అసిస్టెంటువా? అయితే సాబర్ని గురించి నీకు తెల్సివుంటుంది," అన్నాడు సర్దార్ ఆశ్చర్యాన్ని అణచుకుంటూ.

"అవును తెల్సు. యువరాజ్‌కూ తెల్సు. ఇక కాసేపటిలో యిక్కడకు వస్తాడు," అన్నాడు సూరి బెదిరింపుగా.

సర్దార్ నవ్వాడు. "మీ యువరాజ్ యీ పాటికి సముద్రంలో మరణించి వుంటాడు."

సూరి గుండెలు ఝల్లుమన్నవి. మనసు కీడుని శంకించింది.

"మిస్టర్ సూరీ! యువరాజ్ మరణించాడు. మరణించిన యువరాజువు సాబర్ని గురించి ఏం తెల్సు?" అడిగాడు సర్దార్.

"ఒక రహస్యం చెప్పాడు."

"ఏమిటూ రహస్యం?" ఆత్రుతగా, ఆశగా అడిగాడు సర్దార్.

సూరి బదులు చెప్పలేదు. మౌనంగా వుండిపోయాడు.

14

సముద్ర గర్భంనుండి పైకి తేలుతున్న యువరాజ్ కు ఊపిరాడటంలేదు. అప్పటికే చాలా నీళ్ళు త్రాగివేశాడు. మరో గుటక వేయబోయాడు. ఆ సమయానికి జిమ్మున పైకి వచ్చేశాడు. వేగంగా నోటితో, ముక్కుతో గాలిని పీల్చుకుని వూపిరితిత్తులనిండా నింపుకున్నాడు. అలలమీద ఎత్తెత్తి పడుతున్నాడు.

ఫ్రీగా గాలిని పీల్చుకొని శరీరానికి ఉపశమనం కల్గించాడు. తన చుట్టూతా చూశాడు. అంతా జలమయం! తీరం కనబడడంలేదు.

ఏవైపుకు యీదాలి? ఈదుతూ గట్టు చేరుకోగలడా? గట్టు చేరేంతవరకు తను ఈదగలడా? గడచిన గండం పోగా ఎదురైన గండం గడగడలాడించింది. ఎటు ఈదాలి? ఈదేటప్పుడు సొఱచేపలవాత పడతాడేమో? భయంగా వుంది.

దేదీప్యమానంగా మండుతున్న సూర్యుడు నడినెత్తిన వున్నాడు. సరిగ్గా నెత్తిమీద వుండడం మూలంగా దిక్కులు

వూహించడం అసంభవంగావుంది. సూర్యుడు ఏవైపుకు వాలుతాడు? వాలినవైపు పడమర! పశ్చిమదిశవైపు తను ఈదాలి.

తను తీరానికి ఎన్ని మైళ్ళ దూరంలో వున్నాడో? అంత దూరం యీదగలడా? దారీ తెన్నూ కానక యువరాజ్ అక్కడే ఆగి అలసట కలగని రీతిగా యీదుతూ నిలిచాడు. భయకంపితుడైవున్న యువరాజ్ చుట్టుతా చూస్తున్నాడు. ఎండ తీవ్రంగావుంది.

అలాటి సమయంలో ఒకవైపు పొగ కనబడింది. పొగ కనబడగానే యువరాజుకు సంతోషం కల్గింది. పొగవచ్చే వైపు తీరం వుంటుందని ఆశించాడు. మళ్ళీ నిరాశ జనించింది. పొగ తీరం వుంటేనే రాదు. ఆవైపు ఏదైనా స్టీమర్ వస్తుండినా పొగ కనబడవచ్చు. పొగ కనబడిన వైపు తీరం వచ్చినా, నౌక వచ్చినా తను తన ప్రాణాలను కాపాడుకోవచ్చు అనుకుని యువరాజ్ ఆవైపు యీదడం మొదలెట్టాడు.

ఈదగా ఈదగా నౌక జెండా, తరువాత పొగ గొట్టం కనబడింది. యువరాజ్ పైకి చేతులెత్తి వూపుతూ, బిగ్గరగా కేకపెట్టాడు. కేకవేస్తూ, చేతులూపుతూ యువరాజ్ యీదుతున్నాడు.

నౌకలోని వారు బైనాక్యులర్స్‌తో చూస్తే తనని గుర్తిస్తారు. అసలు ఆ నౌకలో ఎవరు వుంటారు? శత్రువులా? మిత్రులా?

అలాగే యువరాజ్ యీదుతున్నాడు. నౌక దగ్గరవుతూంది. ఆనౌక దగ్గరకాగానే అది ఎక్సైస్ అధికారులు స్మగ్లర్స్‌కోసం గస్తీ తిరుగు నావని గుర్తించాడు యువరాజ్. ఎక్కడలేని ధైర్యం కల్గింది.

యువరాజ్ ప్రక్కకు రాగానే నౌకనుండి తాళ్ళనిచ్చెన

దింపబడింది. నిచ్చెన అందుకుని సురక్షితంగా నౌకలోకి వచ్చిపడ్డాడు యువరాజ్. యువరాజుని విచిత్రంగా చూస్తూ నౌకలోని సిబ్బంది యాశత్తూ చుట్టుముాగిపోయారు.

"ఎవరు నువ్వు? నడిసముద్రంలోకి ఎలా వూడిపడ్డావు?" అడిగాడు ఓ అధికారి ఆశ్చర్యంగా.

"నేను ప్రయివేట్ డిటెక్టివ్‌ని. నా పేరు యువరాజ్!" చెప్పాకని అక్కడున్న అందరినంతా చూశాడు యువరాజ్.

యువరాజ్ రొప్పుతున్నాడు. శరీరం బాగా అలసిపోయి వుంది. మృత్యువు వాతనుండి దైవబలం వుండడం మూలంగా బ్రతికినవాడు.

"ప్లీజ్! నాకు ముందు పొడిగుడ్డలు ఏవైనా వుంటే యివ్వండి. తరువాత కాఫీయో, టీయో వేడిగా నాగొంతులో పోయండి," వేడుకున్నాడు.

"మీరు ప్రయివేట్ డిటెక్టివ్ యువరాజ్ అని చెప్పుకుంటున్నారు. మేమెలా నమ్మేది?" అన్నాడు ఒకఅధికారి.

యువరాజ్ విచిత్రపోతూ వారివంక చూశాడు. వారి అనుమానం అర్థమైంది.

యువరాజ్ గబగబా తన తడిసిన బట్టలలోనుండి మనీ పర్సు బయటకు తీశాడు. మనీపర్సునుండా నీళ్ళు కారుతున్నవి. దానిని అధికారికి అందించాడు. అధికారి పర్సులోని కాగితాలను పరీక్షించాడు.

"వి ఆర్ వెరీసారీ మిస్టర్ యువరాజ్! గ్లాడ్ టు మీట్ యూ," అంటూ షేక్‌హాండ్ యివ్వబోయాడు అధికారి.

"నాకాక్కావల్సింది షేక్‌హాండ్ కాదు. ముందు పొడి గుడ్డలు. తరువాత వేడి కాఫీ!" అన్నాడు యువరాజ్ బాధగా.

అధికారి హుకుం నౌకలో మారు మ్రోగింది.

15

"నేను యస్. యు. జె. మాట్లాడుతూంటు!" అన్నాడు యువరాజ్.

"మై గాడ్! బ్రతికేవున్నారా... నా ప్రాణాలు కుదుట పడ్డాయి. మిమ్మల్ని పెట్టెలోపెట్టి సుడిబేకర్‌లో పెట్టినట్లు అనుమానించాను. సుడిబేకర్ కాసర కొండవైపు వెళ్ళినట్లు తెల్సుకుని కాసర కొండవద్ద గాలించి యిప్పుడే వచ్చాను" అన్నాడు ధనార్జనరావు, జరిగిన విషయాలు చెప్పుతూ.

"సూరిని గురించి ఏమైనా తెల్సుకున్నారా?"

"సూరి హాంగ్ కాంగ్ వెళ్ళలేదు. శత్రువులు అతనిని బంధించి తీసుకెళ్ళినట్లు సాక్ష్యాలు లభించాయి. మరో విశేషం ఏమిటంటే సూరికి బదులు గిరి అనేవ్యక్తి హాంగ్ కాంగ్ వెళ్ళినట్లు ఏరోడ్రోమ్‌లో తెల్సుకున్నాను. సూరి, గిరి అనే మారు పేరుతో బయలుదేరాడా?" అడిగాడు ధనార్జనరావు.

"లేదు. సూరి పేరుతోనే!"

"నాకేదో సూరినిగూర్చి భయంగావుంది. మీరు వెంటనే రండి," అన్నాడు ధనార్జనరావు.

"అలాగే వస్తున్నాను," అని చెప్పి రిసీవర్ పెట్టేశాడు యువరాజ్.

యువరాజుకు ఏమీ అంతు చిక్కడంలేదు. సూరిని ఎవరు బంధించి వుంటారు? వారంట్ బంధించి వుంటాడా? తను తెల్సుకోవటం ఎలా? ఎంత ఆలోచించినా యువరాజుకు ఏమీ బోధపడడంలేదు. తను నౌక దిగగానే మొదట ధనార్జనరావుకు ఫోన్ చేశాడు.

టాక్సీ ఆ దరిదాపుల్లో కనబడనందున నడవసాగాడు. ఆ సమయంలో ఒక షాపులోనుండి ఒక యువతి పేవ్ మెంటు

మీదకు వచ్చింది. ఆమెను చూశాడు.

ఆమె సోనియా!! ఆమె తనకు టీ యిచ్చింది. ఆమె కళ్ళ జోడు పెట్టుకున్నంత మాత్రాన తను గుర్తించలేకపోలేదు. అవే బుగ్గలు. అవే వెంట్రుకలు. అవే పెదాలు. అదే మెడ. అదే వళ్ళు. అదే విగ్రహం.

ఆమెను చూస్తుంటే యువరాజుకు కోపం నసాళమంటింది. తనని చావుకు వెంట్రుకవాసి దూరానికి తీసుకెళ్ళిన రాక్షసి. ఆమెను పట్టుకోవాలి. బంధించాలి. పోలీసులకు అప్పగించాలి.

"మిస్ సోనియా!" అరిచాడు యువరాజ్.

గిరుక్కున తిరిగి చూసింది. యువరాజ్‌ని చూచి, "హు ఆర్ యూ?" అడిగింది అమాయకంగా.

ఆమె అమాయకత్వానికి _ అలా నటించడం చూచిన యువరాజుకు వళ్ళు మండిపోయింది. కోపాన్ని అణచుకోలేక ఆమె భుజాన్ని గట్టిగా అదిమి పట్టుకున్నాడు.

"రా పోలీస్ స్టేషనుకు!"

సోనియా గడగడలాడిపోయింది. ఆమెలో కోపం చెలరేగింది. అటువైపు నడిచేవారు, దగ్గరగా వెళ్ళేవారు అందరూ వారిరువుర్నే చూస్తున్నారు.

పేవ్‌మెంటు జనంతో కిటకిటలాడుతూంది. అటువంటి పరిస్థితులలో ఆమెను ఒక మగాడు పట్టుకోగానే తోక తొక్కిన త్రాచులా బుస్సుమంది.

"ఏయ్ మిస్టర్! ఎవరు నువ్వు?" అని అంటూ తన కూలింగ్ కళ్ళజోడును తీసింది. ఆమె కోపంగా యువరాజ్ వంక చూసింది.

ఆమె కళ్ళను చూడగానే యువరాజ్ అదిరిపడ్డాడు. త్రుళ్ళిపోయాడు.

ఆమెకు పూర్తిగా మెల్లకన్ను!!

అచ్చుగా సోనియాలాగేవుంది. సోనియాను తాను పరికించి

చూశాడు. చూచినది గుర్తు చేసుకున్నాడు. ఆమెకు మెల్లకన్ను లేదు. తనకి టీ యిచ్చినప్పుడు, మాట్లాడినపుడు మెల్లకన్ను ఉండివుంటే చూచి ఉండేవాడు. గుర్తు ఉండివుండేది.

16

రౌడీలను ఉద్దేశించి, "వీడిచేత నిజం చెప్పించడానికి ప్రయత్నం చేయండి. ప్రాణాలు పోకూడదు. జాగ్రత్త!" హెచ్చరించాడు సర్దార్.

సూరిని రౌడీలు బరబర ఈడ్చుకెళ్ళారు. ఒక గదిలోకి నెట్టారు. చేతులను వేరువేరుగా బంధించారు.

ఆ దుర్మార్గులు ఏంచేస్తారో తెలియడంలేదు. వారివంక సూరి అయోమయంగా చూస్తున్నాడు.

నల్గురు కాంక్రీట్ కట్టడాల్లా నిలబడి వున్నారు. అందులో ఒకడు, "చెప్తావా? చెప్పాలా" అని ఉరుముతూ అడిగాడు.

సూరి జవాబివ్వలేదు.

రౌడీలు అగ్గిగుగ్గయిపోయారు. ఒకడు గబగబా ఒకగదిలోకి వెళ్ళాడు. మరుక్షణం తిరిగివచ్చాడు. అతని చేతిలో బొగ్గుల పొయ్యి వుంది. ఆ పొయ్యిలో నిప్పులు కణకణమని మండుతున్నై.

"చెప్పకుంటె ఛస్తావ్!"

"చచ్చినా ఫరవాలేదు."

"అయితే చావు" అంటూ ఒకడు కొన్ని మిరపకాయలు తీసుకొచ్చాడు. అవి ఎండు మిర్చి! ఆ మిరపకాయలను మండే నిప్పులలో పోశాడు. పోయగానే అందరూ బిలబిలమంటూ ఆ గదిలో నుండి బయటకు వచ్చేస్తూ తలుపులు మూసేశారు.

సూరి గుండెలు గడగడలాడిపోయాయి. ఆ గదికి కిటికీ సైతము లేదు. నిప్పులమీద మిర్చి పడగానే ఆ గదిలో కోరు ప్రారంభమైంది. మిర్చికోరు వూపిరితిత్తులకు పోతే దగ్గలేక

చావాలి.

భయంకరమైన దగ్గు... కొర్ కొర్ మని దగ్గుతున్నాడు సూరి. అల్లల్లాడి పోతున్నాడు దగ్గలేక. శరీరమంతా ముచ్చెమటలు పట్టేసినై. నరాలన్నీ బిగదీసుకుని దగ్గుతున్నాడు.

మిరపకాయలు నిప్పుల్లో మండేకొలదీ కోరు అధికమవుతూంది. సూరి నిభాయించుకోలేక, దగ్గలేక సతమతమవుతున్నాడు.

దగ్గిదగ్గి స్పృహతప్పి పడిపోయాడు.

17

"ఎక్స్క్యూజ్ మి మాడమ్! మీ పేరు?" భయ భక్తులున్నట్లు నటిస్తూ అడిగాడు.

"మిస్ సోనియా!" చెప్పిందామె చురచురలాడుతూ.

"వారంట్ ని వివాహం చేసుకున్నది మీరేనా?" అడిగాడు యువరాజ్.

ఆమె అదిరిపడింది. యువరాజ్ ని యెగాదిగా చూసింది. ఆమె పెదాలు అదిరాయి. ఆమెలో కల్గిన భయాన్ని యువరాజ్ గ్రహించాడు.

"మీరెవరు?" అడిగింది సోనియా.

"నేను డిటెక్టివ్ ని... మీతో మాట్లాడాలి" అంటూ ఒక టాక్సీని కేకేశాడు.

"నే నడిగిన ప్రశ్నలకు అరమరికలు లేకుండా నిజం చెప్పాలి" అన్నాడు యువరాజ్. సోనియా తల వూపింది.

టాక్సీ పరుగెత్తుతూంది!

"వారంట్ ని వివాహమాడిన మూడుగంటలకే విడాకులిచ్చిన మాట నిజమేనా?" అడిగాడు యువరాజ్.

అవునన్నట్టు తలూపింది సోనియా.

"ఎందుకలా చేశావు?"

"నేను చేయలేదు. మిస్టర్ వారంట్ నాకు విడాకు లిచ్చాడు."

"కారణం?"

"నాకు మెల్లకన్ను వుండడం వివాహానంతరం గమనించాడు వారంట్!"

"కేవలం మెల్లకన్ను వుండడం మూలంగా నిన్ను పెళ్ళాడిన భర్త విడాకులిచ్చాడంటే నమ్మమంటావా? అదీ మూడు గంటలలో..." అన్నాడు యువరాజ్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"అవునండి. నిజమే చెప్తున్నాను."

"నిన్ను వివాహమాడబోయె భర్త నీ కళ్ళు చూడకుండా ఎలా పెళ్ళిచేసుకున్నాడు."

"ఆ విషయం నాకు తెలియదండి. మా అక్కయ్య ప్రోద్బలం మీద జరిగిందీ పెళ్ళి."

"మీ అక్కయ్య పేరు?"

"సలీమా!"

"సలీమా నీలాగే వుంటుందా?"

"అచ్చగా నా పోలికలే, కళ్ళు తప్ప!"

యువరాజ్ మనసు పరిపరి విధాలయింది. సలీమా తనకు టీ ఇచ్చి స్పృహ పోగొట్టింది. అంటె సలీమాకు వారంట్‌తో సంబంధముంది. అయితే ఈ సోనియాకు వుండదా?

ఇంతలో టాక్సీ హెడ్ క్వార్టర్స్ ముందు ఆగింది. అక్కడ యువరాజ్ కోసం ఎదురు చూస్తున్న ధనార్జనరావు ఆదరాబాదరా టాక్సీవద్ద కొచ్చాడు.

యువరాజ్ దిగగానే, "నిన్నిక చూడనేమోనని భయపడి చచ్చాను," అంటూ ఉప్పొంగిన ఆనందంతో ఆలింగనం చేసుకున్నాడు.

కారునుండి దిగుతూన్న సోనియాని చూచిన ధనార్జనరావు,

"ఎవరామె?" ప్రశ్నించాడు. ఆమెకున్న కళ్ళజోడు కొట్ట వచ్చినట్లు దర్శన మిస్తూంది.

"ఈమె పేరు సోనియా! వారంట్ ని వివాహమాడిన మూడు గంటల్లో విడాకులిచ్చింది," అన్నాడు యువరాజ్.

"ఎందుకు?" ఆశ్చర్యపోయాడు ధనార్జనరావు.

"వారంట్ ని భారత పౌరునిగా చేయడానికని అనుమానిస్తున్నాను," అంటూ వివరాలు చెప్పాడు యువరాజ్.

"వాట్ మిస్! వాటీస్ దిస్? యూ, యూ ఫూలిష్ డాగ్... క్రూర మృగాలను ఇంట్లోకి రానిస్తావా?" గర్జించాడు ధనార్జనరావు.

"నో, నో... ఐనో నథింగ్!" అంటూ సోనియా గజగజలాడిపోయింది.

"సూరిని గురించి మీరు తెల్సుకున్న విషయాలేమిటి?" అడిగాడు యువరాజ్ బల్లముందున్న కుర్చీలో కూర్చుంటూ.

"సూరి హాంగ్ కాంగ్ వెళ్ళలేదని రూఢి అయిపోయింది. ఆ సమయానికి గిరి అనే అతను ఎంక్వైరీలోకి అధికారుల కాళ్ళా వేళ్ళా బడి సీటు సంపాదించుకుని వెళ్ళాడు" చెప్పాడు ధనార్జనరావు.

"విచిత్రంగావుంది" ఆలోచనలో పడ్డాడు యువరాజ్.

"ఇంతకీ ఈ గందరగోళమంతా ఏమిటి?"

జరిగిన విషయాలను విపులంగా వివరిస్తూ, "వారెంట్ మీద నాకు అనుమానంగావుంది," అన్నాడు యువరాజ్.

"ఈ వారంట్ మాజిక్ షోలు ప్రదర్శన లివ్వడానికి హాంగ్ కాంగ్ నుండి వచ్చాడని తెల్సింది," చెప్పాడు ధనార్జనరావు.

"అలా వచ్చినవాడైతే సోనియాని పెళ్లెందుకు చేసుకున్నాడు?"

"ఏమిటి పిచ్చిప్రశ్న? పెళ్ళెందుకు చేసుకుంటాడు?

సోనియాది బ్యూటిఫుల్ ఫిగర్! కళ్లు గాక."

"ఇందులో ఏదో విశేషం వుంది మిస్టర్ ధనార్జనరావ్! నేను వారంట్‌ని కల్సుకోడానికి వెళ్ళినప్పుడు యాభై మందిలో నన్ను పరీక్షగా చూశాడు. సోనియా అక్క సలీమా నన్ను చంప ప్రయత్నించింది."

"సూరిని హాంగ్ కాంగ్ వెళ్ళకుండా చేయడంకూడా గమనించవలసిన విషయం," అన్నాడు ధనార్జనరావు.

"అవును. ఆ విషయాలన్నీ తెలియాలంటే వారంట్‌ని అడగాలి. రండి వెళదాం. సోనియానికూడా వెంటబెట్టుకు వెళదాం. వారంట్ అసలు స్వరూపం తెలియవచ్చు. అంతే గాక ఈ కేసు గమ్యం ఏమిటో బోధపడుతుంది," చెప్తూ లేచి నిలబడ్డాడు యువరాజ్.

18

"మిస్టర్ వారంట్! మీరు సోనియాని వివాహమాడిన మూడుగంటలకే విడాకులు ఎందుకు యిచ్చారో చెప్పాలి," అన్నాడు అధికార హోదాతో ధనార్జనరావు.

వారంట్ తటపటాయించాడు. సోనియాని విచిత్రంగా చూశాడు. సోనియా తన కళ్ళజోడును తీసేసి వారంట్ వంక చూసింది. ఆమె మెల్లకన్ను వెక్కిరిస్తూంది!

"ఆమెకు మెల్లకన్ను," అసహ్యించుకున్నాడు వారంట్.

"మెల్లకన్ను వున్నంతమాత్రాన ఎవరైనా విడాకులు యిస్తారా?" వ్యంగ్యంగా అడిగాడు ధనార్జనరావు.

"అందానికి కళ్లు ఎంతో ముఖ్యం! అటువంటి కళ్ళకు 'మెల్ల' వుండడం సహించలేకపోయాను. మోసపోయానని గ్రహించాను."

"ఆమె కళ్ళను చూడకనే ఎలా పెళ్ళికి ఒప్పుకున్నారు?"

"ఆమె కళ్ళను చూళ్లేదు."

"కళ్ళను చూడకపోవడం ఏమిటి?" నవ్వాడు ధనార్జన రావు.

"అవును నేను చూచినపుడు ఆ నల్ల కళ్ళజోడుతోనే వుంది. కళ్లు కనబడలేదు," చెప్పాడు వారంట్.

"మీ మాటలు నమ్మశక్యంగా లేవు. మీరు హాంగ్ కాంగ్ నుండి మాజిక్ ప్రదర్శనలు యివ్వడానికి వచ్చారని విన్నాం. గనక మీ వీసా పత్రాలు, పాస్‌పోర్టు చూపండి. మీరు భారతదేశ పౌరసత్వాన్ని పొందడానికి సోనియాని వివాహ మాడినట్టు నటిస్తున్నారని అనుమానిస్తున్నాం," చెప్పాడు యువరాజ్.

"కారణం?"

"తరువాత చెప్తాం. ముందు మీ వీసాను, పాస్‌పోర్టును చూపండి," అన్నాడు ధనార్జనరావు.

"అలాగే" అంటూ వారంట్ ప్రక్కనున్న గదిలోకి వెళ్ళాడు. ధనార్జనరావు, యువరాజ్ ఒకర్నొకరు చూసు కున్నారు. సోనియా తలవంచుకుని వుంది.

మూడునిముషాలు గడిచాయి. వారంట్ గదిలోకి వెళ్ళిన వాడు యింకా రాలేదు. అంతలో ఒక మూలుగు వినబడింది.

యువరాజు అనుమానిస్తూ లేచి నిలబడ్డాడు. ధనార్జన రావుని రమ్మని సైగ చేస్తూ ముందుకు కదిలాడు. ఇద్దరూ ఆ గదిలోకి అడుగెట్టారు.

ఆశ్చర్యం! వారంట్ రక్తపు మడుగులో గిజగిజ తన్ను కుంటున్నాడు.

కత్తి గుండెల్లో దిగబడివుంది. కత్తి పిడిని వారంట్ గట్టిగా పట్టుకుని వున్నాడు. కత్తిని లాక్కొంటున్నాడా? యువరాజ్, ధనార్జనరావులు క్షణకాలంపాటు నిర్వీర్యులై పోయారు.

ఒక్కంగలో ఇద్దరూ వారంట్‌ని కల్సుకున్నారు. యువ

రాజ్ వారంట్‌కు అర్టిఫిషియల్ రెస్పిరేషన్ చేయబోతూ "ఎవరీ ఘాతుకం చేసింది?" అని ప్రశ్నించాడు.

వారంట్ గుడ్లు తేలవేసేశాడు.

ధనార్జనరావు తన పిస్తోలును అందుకుని, "డామిట్ హంతకునికి ఎంత ధైర్యం?" అని పళ్ళు పటపట కొరుకుతూ ఆదరాబాదరా ఆవేశంతో తనకు తోచిన వైపుకు దూసుకు పోయాడు హంతకుణ్ణి పట్టుకోడానికి.

హంతకుడికి ఎంతో వ్యవధిలేదు. పొడవబడ్డ వారంట్ చావబోతున్నాడు. అంటే హంతకుడు ఆ ఇంట్లోనే వుండి వుంటాడు. తను ఆలస్యంచేస్తే హంతకుడు పారిపోవచ్చు.

యువరాజ్, వారంట్ వంక చూస్తే బ్రతకడనితోచింది. కత్తి గుండెల్లో దిగబడివుంది. వారంట్‌ని ఎవరైనా చంపారా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా?

తను యిక దొరికిపోవచ్చని భయపడి వారంట్ ఆత్మ హత్య చేసుకుని ఉండొచ్చు. లేదా అసలు విషయాన్ని పొక్కతాడన్న భీతితో అతని అనుచరులెవరైనా చంపి ఉండొచ్చు.

ఆలోచిస్తూ యువరాజ్ పిస్తోలు పట్టుకుని ధనార్జనరావు వెళ్ళినవైపుగాక మరోవైపుకు అడుగులు వేశాడు. తప్పక హంతకుడు ఉన్నట్టయితే అక్కడే వుండివుండాలన్న నమ్మకం యువరాజుకుంది.

చకచక చూసుకుంటూ పిస్తోలును సిద్ధంగా పట్టుకుని వెదుకుతున్నాడు.

వారంట్ వున్న యింట్లో గదులన్నిటినీ, కర్టెన్ల వెనుక చూస్తున్నాడు. గుండెలు దడదడలాడుతున్నై.

ఒక గదిలోకి అడుగుపెట్టాడు యువరాజ్. ఆశ్చర్యం! నల్గురు వ్యక్తులు ప్రవాహంలావచ్చి మీదపడిపోయారు. ఆ నలుగురూ ఆంబోతుల్లాగున్నారు. వారి బలంముందు యువ

రాజ్ నిలబడలేక తూలిపోయాడు. పిస్తోలు పేల్చడానికి అవకాశం లేకపోయింది.

యువరాజుని యిరికించి పట్టేశారు. అందరివంకా క్రోధంగా చూశాడు. అందులో ఒకడు డ్రైవర్! తనని మోసంచేసి సలీమావద్దకు పంపి చంపడానికి ప్రయత్నించిన వాడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు యువరాజ్ అతనిని.

"నా పేరు సర్దార్!" చెప్పాడతను. విస్తుపోయి అతనిని చూశాడు. ఆ చూపుల్లో కాఠిన్యముంది. "మిస్టర్ యువరాజ్! వారంటుని అసలు సోనియా వివాహమాడలేదు. మీతో అబద్ధం చెప్పాను. ఎందుకంటే మిమ్మల్ని బంధించడానికి," అన్నాడు సర్దార్.

యువరాజుకు మతిపోయినట్లుంది.

"అవును. ఈ ముగ్గురే మిమ్మల్ని సముద్రంలో పడేశారు. ఈ ముగ్గురు పేరుమోసిన రౌడీలు. జాగ్రత్త!" సర్దార్ హెచ్చరించాడు.

"అంత పెద్ద చావునుండి ఎలా తప్పించుకున్నావ్?" ప్రశ్నించాడు సామ్సన్. సామ్సన్ని వురిమిచూశాడు యువరాజ్.

"ఊఁ తీసుకురండి," అన్నాడు సర్దార్.

ధనార్జనరావు ఏమయ్యాడు? తనలాగే అతనినీ...ఏమో? యువరాజ్ గుండెలు ధమధమలాడిపోయాయి.

వారంట్ పడివున్న చోటుకి వచ్చారు.

"లేవండి," అన్నాడు సర్దార్.

నవ్వుతూ పడివున్న వారంట్ లేచి నిలబడ్డాడు!! నిలబడ్డ వారంట్ యువరాజుని హేళనగా చూశాడు!!!

యువరాజుకు అప్పుడు అర్థమైంది, వారంట్ మోసం చేశాడని! వారంట్ చేసేదే మోసం. మాజిక్ విద్య ఒక

విధమైన మోసం. ఆ మోసంతోటే ప్రజలను వంచించి బ్రతికేవాడు. అందుకే రష్యా ప్రభుత్వం ఇంద్రజాలికులను మంత్రగాళ్ళను చెరసాలలోకి నెట్టున్నారు.

తనముందు వారంట్ చనిపోయినట్టు నటించాడు. నటనని తనా సమయంలో తెల్సుకోలేకపోయాడు.

"మిస్టర్ యువరాజ్, ఐయామ్ వెరివెరి సారీ! వేరే గత్యంతరంలేక చచ్చినట్టు నటించి మిమ్మల్ని మోసం చేశాను," అన్నాడు వారంట్ రంగు పులుముకున్న కోటును విప్పుకుంటూ.

"ఏమిటీ కుతంత్రం?" గర్జించాడు యువరాజ్.

"మీకిక తెలుస్తుంది," అన్నాడు సర్దార్.

ఇంతలో ఆవైపు గదిలో కూర్చుని వుండిన సోనియా వయ్యారంగా నడిచివచ్చి యువరాజ్ ముందు నిలబడింది. యువరాజుని వెటకారంగా చూస్తూ, ఆమె తన కళ్ళ జోడును తీసేసింది. ఆశ్చర్యం.

ఆమె కిప్పుడు మెల్లకన్ను లేదు!!

యువరాజ్ స్తంభించిపోయి ఆమెవంక తదేకంగా చూశాడు. సోనియాకు వాస్తవంగా మెల్లకన్ను లేదు. మెల్ల కన్ను వున్నట్టు తన కళ్ళను, జోడు తీసినపుడు సర్దుకుంది. తను నిజమని భ్రమ చెందిపోయాడు. ఎంత మోసపోయాడు తను?!

వారిముందు తనేకాదు ధనార్జనరావూ మోసపోయాడు. ఇంతకీ ధనార్జనరావు ఏమైయ్యాడు? యువరాజుకు ముచ్చెమటలు పట్టేసినై.

"ధనార్జనరావుని ఏంచేశారు?" జీరగొంతుతో ప్రశ్నించాడు యువరాజ్.

"ధనార్జనరావుని చంపాలని కొట్టలేదు. కొట్టాము. చచ్చాడో, బ్రతికాడో మాకు తెలియదు," అన్నాడు సర్దార్.

యువరాజ్ గుండెలు దడదడ లాడిపోయాయి. తను అంతమంది మధ్యనుండి తప్పించుకోవడం దుర్లభం. ధనార్జనరావుకు ప్రాణాపాయం సంభవించిందా? సోనియా పతంత్రం మూలంగా ధనార్జనరావునీ యీ వూబిలోకి లాగవలసి వచ్చింది.

"నన్నెందుకు బంధించారు? నాతో మీకేం పని? సూరి మీకేం ద్రోహం చేశాడు?" యువరాజ్ కంఠం బొంగురు బోయింది.

"మిస్టర్ యువరాజ్! సాబర్ మీకు తెలుసు అనుకుంటాను" అన్నాడు వారంట్.

"సాబర్ని నేనెప్పుడూ చూళ్ళేదు. నాకు టెలిఫోనులో తన పేరు సాబరని చెప్పుకున్నాడు!" చెప్పాడు యువరాజ్.

"సాబర్ మీకు ఫోనులో ఏం చెప్పాడో మేము వినలేక పోయాం. ఒక రహస్యాన్ని గురించి చెప్పాడని అనుకుంటున్నాం. అతను చెప్పిన రహస్యం ఏమిటి?" అడిగాడు పర్దార్.

"సాబర్ నాకు రహస్యం చెప్పదలచి నన్ను కాసరకొండవద్దకు రమ్మన్నాడు. వెళ్ళాను కానీ సాబర్ని కల్సుకోలేదు."

"మీరు కల్సుకోలేదని మాకు తెల్సు. కానీ సాబర్ అతని వద్ద వుండిన రహస్యాన్ని మీ కొక్కరికే చెప్తానని మొండిపట్టు పట్టాడు. కనక మీకు తప్పక చెప్పివుంటాడు," అన్నాడు వారంట్.

"లేదు. చెప్పలేదు. అడిగాను. చూచాయగానైనా చెప్ప లేదు. రహస్యం దేనికి సంబంధించినదని ఎంతడిగినా చెప్ప లేదు. నన్ను కాసరకొండ వద్దకు రమ్మన్నాడు. అంతే!" అన్నాడు యువరాజ్.

"అబద్ధం! అంతా అబద్ధం" అరిచాడు వారంట్.

"అవును మిస్టర్ యువరాజ్. మీ అసిస్టెంటు సూరి సాబర్ చెప్పిన రహస్యం గూర్చి తెల్సని ఒప్పుకున్నాడు. మీరు బుకాయించి లాభంలేదు. నిజం చెప్పండి," సర్దార్ నోటినుండి హెచ్చరిక వినబడింది.

యువరాజుకు ఆశ్చర్యమేసింది. సూరి ఎందుకలా అబద్ధం చెప్పాడు? నిజానికి సాబర్ చెప్పబోయిన రహస్యం తమ ఇద్దరికీ తెలియదు. సూరి ఎందుకు తెల్సని చెప్పుకున్నాడు? యువరాజ్ కు అంతుచిక్కలేదు.

"సాబర్ నా కెటువంటి రహస్యమూ చెప్పలేదు. నా కేమీ తెలియదు," అన్నాడు యువరాజ్.

"మిస్టర్ యువరాజ్! మీరు పేరుమోసిన డిటెక్టివ్ లు. అంటే శిక్షణ పొందినవారు. మిమ్మల్ని యెంత హింసించినా నిజం చెప్పరని మాకు తెల్సు" అంటూ వారంట్, సర్దార్ చెవులో యేదో చెప్పాడు రహస్యంగా.

అంతలో అక్కడికి ఒకతను వచ్చి, హాంగ్ కాంగ్ నుండి గిరి వచ్చినట్లు చెప్పాడు. అందరి కళ్ళల్లో సంతోషం వెల్లి విరిసింది. యువరాజ్ ను ఎటో తీసుకెళ్ళసాగారు.

19

చాలాసేపు ప్రయాణించిన కారు ఒకచోట ఆగింది. అందరూ దిగారు. యువరాజునీ క్రిందకు దింపారు. ఆ ప్రదేశాన్ని చూచిన యువరాజ్ గుండెలు ఢమఢమ లాడిపోయాయి.

అది బీచ్ ప్రాంతం! అల్లంత దూరంలో సముద్రం భీకరంగా గోచరిస్తూంది.

వారంట్, సర్దార్, గిరిలు యువరాజుని పట్టుకుని ఇసుకలో నడిపించుకు వెళ్తున్నారు.

యువరాజు వుండబట్టలేక, "ఎక్కడికి?" అని అడిగాడు.

"సముద్రంలోనికి!" చెప్పాడు వారంట్.

"ఎందుకు?" భయంతో అడిగాడు యువరాజు.

"ఎందుకేమిటి? పిచ్చి ప్రశ్న! చావడానికి," అన్నాడు సర్దార్.

యువరాజుకు అయోమయంగా వుంది. సముద్రంలోనికి ఎందుకు? మళ్ళీ ఏం చేస్తారు? యువరాజు తల్లడిల్లిపోతున్నాడు.

అందరూ సముద్రపు జలాలవద్దకు చేరుకున్నారు. అలలు వువ్వెత్తున లేచి మీద పడేటట్టున్నవి. గంభీరమైన సముద్రం భీకరంగా గోచరిస్తూంది.

ఆ సమయంలో అక్కడికి ఒక మోటర్‌బోటు వచ్చింది. బోటు చాలా పెద్దదిగా వుంది. ఆ బోటులోనికి అందరూ ఎక్కి కూర్చున్నారు. గిరి డ్రైవ్ చేయగా బయలుదేరింది.

మోటర్ బోటు అలలను చీల్చుకుంటూ ముందుకు ప్రయాణిస్తూంది.

భూ ప్రదేశం మీదైతే తప్పించుకోవచ్చు. జల ప్రదేశంలో ఎలా తప్పించుకోవడం? నడిసముద్రంలో బోటులో నుండి తప్పించుకుని ప్రాణాలతో బయటపడడం అసాధ్యం! యువరాజు శరీరమంతా వణికిపోతూంది. తప్పనిసరి తనని చంపేస్తారేమో?

చాలా దూరం ప్రయాణించిన బోటు ఆగింది. చుట్టూ ఎటు చూచినా గంభీరమైన సముద్రం. భూప్రదేశం లీలగానైనా గోచరించడం లేదు. బోటు అలలమీద వూగిపోతూంది.

బైనాక్యులర్స్ పెట్టుకుని వారంట్, సర్దార్ తిలకించారు. కనుచూపు మేరలో ఎటువంటి నౌకలు గోచరించలేదు.

యువరాజ్ బిక్కుబిక్కుమంటున్నాడు. ఆ దుర్మార్గులు ఏం చేయబోతారో అనూహ్యంగా వుంది.

"మిస్టర్ గిరీ! ఊ...ఇక చెప్పు. హాంగ్ కాంగ్ లో నువ్వు తెల్సుకున్న దేమిటి? సాబర్ వద్ద వుండిన రహస్యం ఏమిటో తెల్సుకున్నావా?" ప్రశ్నించాడు వారంట్.

సర్దార్ యువరాజులు గిరి ఏం చెప్తాడో వినడానికి చెవులు రిక్కించి పెట్టారు. సముద్రపు గాలి రివ్వున వీస్తూంది. అక్కడి వాతావరణం అతిభయానకంగా వుంది.

"ఒక పత్రికా విలేఖరి పాకిస్తాన్ లో దొంగచాటుగా తిరుగుతూ బంగ్లాదేశ్ కు సంబంధించిన కొన్ని రహస్యాలను సేకరించాడు. పైగా నిక్సన్ ఉత్తర వియత్నాం మీద ప్రయోగించబడు ఆయుధాలను పాకిస్తాన్ కు యెలా సరఫరా చేయబడేది తగిన ఆధారాలతో, ఫోటోలతో సేకరించాడు," చెప్పాడు గిరి.

"తర్వాత?" అడిగాడు సర్దార్.

"ఆ విలేఖరి సంపాదించిన సాక్ష్యాధారాలు ప్రపంచానికి తెలిస్తే యాహ్యాఖాన్ ని కాల్చి బూడిదచేసి గాలిలో తూర్పార పెట్టారట!" అన్నాడు గిరి.

అవును. అటువంటి నియంతల చరిత్ర తిరగవేస్తే బోధ పడుతుంది. హిట్లర్ ప్రపంచ అధినేత కావాలని రెండవ ప్రపంచ యుద్ధాన్ని సృష్టించాడు. చివరకు చావడానికి విషం తాగాడు. తాగిన విషం తనని చంపుతుందో చంపదో నని పిస్టోలుతో కాల్చుకుని మరీ చచ్చాడు. అలా చచ్చిన హిట్లర్ శవాన్ని కాల్చి బూడిద చేశారు. ఆ బూడిదను గాలిలోకి వదిలి తూర్పారబట్టారు ప్రజలు. యువరాజ్ మనసు వికలమైపోయింది.

"ఊఁ చెప్పు," అన్నాడు వారంట్.

"పాకిస్తాన్ లో సంపాదించిన ఆధారాలను తీసుకుని బయట ప్రపంచానికి రాలేక సతమతమైయ్యాడు. అక్కడ నుండి తప్పించుకుని చైనాలోకి వెళ్ళాడు. చైనాలో ఆ విలే

ఖరి అతి సాహసం చేశాడని చెప్పాలి. చైనా రాజకీయాల గురించిన భోగట్టాను సేకరించాడు. ముఖ్యంగా మావో సేటింగ్ గూర్చి విచిత్రమైన వివరాలను తెల్సుకున్నాడు. అందుకు తగిన ఆధారాలు, ఫోటోలు సంపాదించాడు. మావో సేటింగ్ చాల్రోజుల క్రితమే మరణించాడని, అతని స్థానంలో నకిలీ మావో యిప్పుడు అధికారంలో ఉన్నాడని విలేఖరి తెల్సుకున్న విషయాలలో విశేషమైనది!!" అన్నాడు ఆశ్చర్య పడుతూ గిరి.

యువరాజ్ ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. చైనా అధినేత మావో మరణించాడా? అతని స్థానంలో మరొకరు మావోలా నటిస్తూ చైనాని పాలిస్తున్నాడా? యువరాజుకు నమ్మశక్యం గాకపోయింది. ఆ బోటులోవున్న వారంతా గట్టిగా గాలి పీల్చుకున్నారు. కాసేపు గుండెలు కొట్టుకోవడం ఆగిపోయాయి అందరికీ.

"ఆ విలేఖరి హాంగ్ కాంగ్ ఎందుకు వచ్చాడు? ఎలా వచ్చాడు? అతనివద్ద నున్న రహస్యాలు సాబర్ కు ఎలా వచ్చాయి?" ప్రశ్నించాడు వారంట్.

"చైనాలో అతనిని కొందరు గూఢచారులు అనుమానించి వున్నంటూరు. ఎలాగో తప్పించుకుని హాంగ్ కాంగ్ చేరుకున్నాడు. ఎంత నేర్పుగా తప్పించుకున్నా ఆ విలేఖర్ని ఏజెంట్లు వదిలిపెట్టలేదు. 'హాంగ్ కాంగ్ లేడీ' అనే హోటల్లో బసచేశాడు. అతనివద్ద వున్న రహస్యాన్ని సంపాదించడానికి చాలామంది తాపత్రయ పడ్డారు. ఆ ఘర్షణలో చావుదెబ్బ తిన్నాడు.

"చనిపోవు సమయంలో తప్పించుకుని ప్రక్కగదిలో వున్న సాబర్ని రహస్యంగా పిలిచి అతనికి తనవద్దనున్న రహస్యానికి సంబంధించిన కాగితాలను అందిస్తూ, 'మీరు

ఇండియాలో డిటెక్టివ్ యువరాజుకు ఈ కాగితాలను అందించండి” అని చెప్పి, మరణించాడు.

“సాబర్ ఆ సమయంలోనే ఇండియాకు ప్రయాణమవుతున్నాడు. సురక్షితంగా అతను విమానాశ్రయం చేరుకుని క్షేమంగా ఇండియా చేరుకున్నాడు,” అని విశదంగా చెప్పాడు గిరి.

యువరాజు ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ఆ విలేఖరి ఎవరు? తన పేరును ఎందుకు సూచించాడు? అంత పెద్ద రహస్యం తనకు అప్పగించమనడంలో ఆంతర్యం ఏమిటి? ఆ విలేఖరి తనకు తెల్సినవాడా? లేక తనని గురించి తెల్సిన విలేఖరా?? యువరాజుకు మనసంతా గజిబిజి అయిపోయింది.

“మిస్టర్ యువరాజ్! విన్నారుగా. మీరు చెప్పనంత మాత్రాన తెల్సుకోలేమని భ్రమ చెందకండి. రహస్యం దేనికి సంబంధించినదో అర్థమైపోయింది. ఇక ఆ రహస్యాన్ని సాబర్ ఎక్కడ దాచాడో మీరు చెప్పాలి,” అని హుంకరించాడు వారంట్.

“నిజం చెప్తున్నాను. నమ్మితే నమ్మండి–సాబర్ రహస్యం చెప్తాను, రమ్మని చెప్పాడేగానీ ఫలానా రహస్యంగానీ, దానిని దాచిన స్థలముగానీ నాతో చెప్పలేదు. అలా చెప్పివుంటే నా కేమిటి అభ్యంతరం మీతో చెప్పడానికి? ఆ రహస్యం నా దేశానికి సంబంధించినదికాదు. నాకూ సంబంధించినదికాదు,” చెప్పాడు యువరాజ్.

వారంట్, గిరిని చూశాడు. గిరి సర్దార్ని చూశాడు.

ముగ్గురూ కల్సి యువరాజుని లేపి నిలబెట్టారు. యువరాజ్ చేతులను శరీరానికి చేర్చి బలంగా బంధించివున్నారు. కట్లను విప్పారు. అదను చిక్కితే తిరగబడాలని యువరాజుకుంది. కాని చిక్కడంలేదు.

యువరాజు చేతుల రెంటిని దండం పెట్టినట్టు కలిపి

గట్టిగా పట్టుకున్నాడు సర్దార్. ఆ చేతులను కలిపి గిరి బంధించాడు. తాడు ఒక చివరతను గట్టిగా పట్టుకున్నాడు. కాళ్ళకు వారంట్ బంధాలు బిగించాడు.

యువరాజ్ చివరిసారిగా తనకేమీ తెలియదని వేడుకున్నా ఎవరూ వినిపించుకోలేదు.

డిటెక్టివ్ యువరాజుని పూర్తిగా సముద్రంలోకి దింపేశారు.

నీటిలో మునిగిపోయి వున్న యువరాజ్ యెంతసేపని వూపిరి బిగపట్టి వుండగలడు? మళ్ళీ పైకి లేపారు. గాలి పీల్చుకునే లోపు మళ్లీ దింపారు. యువరాజ్ ఉక్కిరి బిక్కిరై పోయాడు. తన చావు ఇక ఎంతో సేపు లేదు. తప్పించుకోవడం అసంభవం..

అసంభవం అన్నది మందబుద్దుల నిఘంటువులోనిది. ఏదో ఎత్తు వేయాలి. చావునుండి రక్షించుకుంటూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు యువరాజ్.

యువరాజుని ముంచి ముంచి లేవనెత్తుతున్నారు. ఊపిరాడక సతమతమై మృత్యువుతో పోరాడుతున్నాడు.

యువరాజుని నీటి పైకి లేపి, "చెప్పు" అడిచాడు.

"చెప్తాను" బిగ్గరగా కేక పెట్టాడు యువరాజ్.

"ఊఁ చెప్పు!" గర్జించాడు వారంట్.

"కాస్త అలసట తీర్చుకోనివ్వండి," ప్రార్థించాడు యువరాజ్. అన్నాడే గానీ ఏం చెప్పాలో అర్థంకావడం లేదు.

యువరాజుని పైకి లాగి బోటులోనికి కుదేశారు. గట్టిగా వుచ్ఛ్వాస నిశ్వాసలు విడుస్తున్నాడు. ఆ ముగ్గుర్ని పరకాయించి చూశాడు. తనని ఆవురావురుమని చూస్తున్నారు. తనా సమయంలో యేదో ఒకటి చెప్పాలి లేదా తప్పించుకోడానికి ప్రయత్నించాలి. ఎలా?

తను చెప్పినా, చెప్పకపోయినా తన ప్రాణాలు పోవడం ఖాయం! గనక తన శక్తి యుక్తులను వుపయోగించాలి. శరీరాన్ని నిగడదీశాడు. నరనరాలు జివ్వుమన్నవి. ప్రాణ రక్షణార్థం ప్రతి జీవిలోని వెన్నెముకకు ఎనలేని బలం చేకూరుతుంది.

ఆ ముగ్గురూ యువరాజుని సంతోషంతో చూస్తున్నారు. సాబర్ రహస్యాన్ని ఎక్కడ దాచాడో యువరాజు యిక చెప్పేస్తాడని ఆత్రుతగా చూస్తున్నారు.

యువరాజు మెల్లగా లేచి నిలబడ్డాడు. కాళ్ళకు బంధాలు వున్నప్పటికి సమాళించుకోగల్గాడు. యువరాజుని విచిత్రంగా చూస్తూ "చెప్పు, చెప్పు" ఆదుర్దాగా అడిగారు.

యువరాజు ముందుగా సర్దార్‌కి గురి చూసుకున్నాడు. అంత అలిసిపోయిన యువరాజు తమను ఏమీ చేయలేడన్న నమ్మకం వుంది వారిలో.

కట్టివేయబడి వున్న కాళ్ళూ చేతులతో ఆ ముగ్గుర్ని జయించడం దుర్లభం అని తెల్సికూడా తెగించాడు. తెగించి తీరాలి. లేనిచో తనని అష్టకష్టాలకు గురిచేసి చంపుతారు.

సర్దార్ ముందుకు-బంధాలున్న కాళ్ళతో గెంతుతూ, దండం పెట్టినట్టున్న చేతితో అతని మెడమీద రాక్షసంగా కొట్టేశాడు యువరాజ్. ఆ దెబ్బకు విరుచుకు పడబోతూ బోటు చివరన పడి సముద్రంలోనికి దొర్లి పడిపోయాడు సర్దార్.

యువరాజ్ పడబోతూ సమాళించుకునే సమయంలో గిరి వెనకనే వచ్చి మీద పడిపోబోయాడు. ఆ అదనులో తన మోచేతితో కర్కశంగా అతని గుండెలమీద గుద్దాడు. ఆ దెబ్బకు 'కిక్' మంటూ గిరి కూడా సముద్రంలోకి దొర్లి పోయాడు.

వారంట్ అచ్చెరువు చెందిపోయి యువరాజుని బెదు

ఱగా చూస్తూ తటాలున పిస్తోలును అందుకుని గురి పెట్ట బోయాడు. యువరాజ్ క్షణమూ ఆలస్యం చేయలేదు. వారంట్ మీద విరుచుకు పడిపోయాడు. పడుతూ తన చేతులతో అతని వద్దవుండిన పిస్తోలును యెగుర కొట్టేశాడు.

యువరాజ్ శరీర భారానికి తాళలేక వారంట్ మొదలు నరికిన చెట్టులా దభేలున సముద్రంలోనికి పడిపోయాడు.

యువరాజ్ చకచక నోటితో చేతిబంధాలను విప్పు తున్నాడు. కాళ్ళకున్న బంధాలను తొలగించాడు.

ఆదరాబాదరా వెళ్ళి ఇంజన్ స్టార్ట్ చేశాడు.

20

మోటర్ బోటు బయలుదేరింది.

వెనుక కేకలు వినబడుతున్నాయి. వారంట్, గిరి, సర్దార్లు నడిసముద్రంలో అలల మధ్య కొట్టుకులాడుతూ ఈదు తున్నారు. అక్కడనుండి తీరాన్ని చేరుకునేలోపు ఈదలేక చస్తారు. యువరాజ్ వెళ్ళితే ఆ నడిసముద్రంలో చావక తప్పదు.

చావుకు భయపడ్డ ఆ ముగ్గురు పొలికేకలు పెట్టున్నారు. తిరిగి చూశాడు. యువరాజ్ మనసు చివుక్కుమంది. ఆయన మనసు ఒప్పుకోలేదు.

వాళ్ళెంతటి దుర్మార్గులైనా యువరాజ్ మనసు కరిగి పోయింది. తను బోటులో వెళ్ళిపోతే తప్పక చచ్చి తీరు తారు. అంత దారుణం తను తెల్సి చేయలేదు. వాళ్ళను సురక్షితంగా గట్టుచేర్చి ప్రభుత్వానికి అప్పగించడమే న్యాయం, ధర్మం!—అదే మానవత్వం కూడా!!

యువరాజ్ బోటుని వెనుతిప్పి వాళ్ళ సమీపానికి వచ్చాడు.

ఆ ముగ్గురూ భయాందోళనలకు లోనై ఉప్పునీళ్ళను

గుటకలు వేస్తూ యువరాజుని దీనంగా చూస్తూ అలలమీద ఎగిరెగిరి పడుతున్నారు.

యువరాజుకు జాలేసింది. ఆ ముగ్గురి చుట్టూ బోటును రౌండ్ కొట్టించాడు.

బోటులోనికి ఎక్కడానికి ఆత్రుత చెందిపోతున్నారు. వాళ్ళు బాగా అలిసిపోయిన తరువాత ఎక్కించుకోవాలని యువరాజ్ వుద్దేశం. అలిసిపోతే తనకు లొంగి పడివుంటారు. అందుకే వాళ్ళను చాలా సేపు ఈదనిచ్చాడు.

బోటు వాళ్ళ కందకుండా తిప్పుకుంటూ శాలాన్ని వెళ్ళబుచ్చాడు. అలిసిపోయారని అనుకున్న పిదప, "ఒక్కొక్కరే రావాలి," అన్నాడు.

ముగ్గురూ తలలూపారు.

తాళ్ళనిచ్చిన దింపగానే వారంట్ పైకి వచ్చాడు ఛస్తూ. వెంటనే యువరాజ్ బంధించాడు. ఆ విధంగా ముగ్గుర్నీ బంధించి బోటును నడుపుకుంటూ బయలుదేరాడు.

"ఫూల్స్!!సాబర్ నాకసలు రహస్యం గురించో, దానిని దాచిన సంగతో చెప్పనే లేదు," అన్నాడు యువరాజ్.

"మరి ఆ రహస్యం ఏమైంది?" అడిగాడు వారంట్.

"ఏమో? నాకేం తెల్సు? ఎలా తెలుస్తుంది? సాబర్ని చంపేసి నా వెంటబడి అడుగడుగునా ఆపదలకు గురిచేశారు. ఇడియట్స్! అర్థం పర్థం లేకుండా అఘోరించారు," అసహ్యించుకున్నాడు యువరాజ్.

ముగ్గురూ సిగ్గుతో తలలు వంచుకున్నారు.

బోటు తీరం చేరుకుంది. ముగ్గుర్నీ జాగ్రత్తగా బంధించి దింపాడు. ఇసుకలో నడుస్తున్నారు. ఆశ్చర్యం.

ఆ సమయంలో సోనియా తన బలగమైన రౌడీమూకతో చుట్టు ముట్టేసింది. యువరాజ్ అవాక్కై నిలబడిపోయాడు. అల్లంత దూరంలో బంధితుడైవున్న సూరిని ఇద్దరు రౌడీలు

ఇసుకలో ఈడ్చుకొస్తున్నారు. యువరాజ్ గుండెలు గడ గడ లాడిపోయాయి.

గబగబ వారంటుని, గిరిని, సర్దార్ ని విడిపించారు.

యువరాజ్ కి ఏంచేయాలో పాలుపోలేదు. నూరి బంధితుడై వున్నాడు. తను ఒక్కడూ అంతమందిని జయించడం అసాధ్యం.

"మిస్టర్ యువరాజ్ ఆ రహస్యాలను సాబర్ ఎక్కడ దాచి ఉంటాడని మీ అనుమానం?" అడిగాడు వారంట్.

"ఏమో?" అన్నాడు యువరాజ్.

"మీరు పేరుమోసిన డిటెక్టివ్ లు. అంతమాత్రం తెల్సుకోలేరా?" అన్నాడు సర్దార్ వ్యంగ్యంగా.

"దద్దమ్మల్లారా! గూఢచారులని చెప్పుకోడానికి మీకు సిగ్గులేదూ!? వెళ్ళండి. కనుక్కోండి. అదే మీ ప్రజ్ఞ!!" అని ఇసుకలో పడివున్న నూరి గర్జించాడు.

"ఊఁ తీసుకురండి," అన్నాడు వారంట్. అందరూ బయలుదేరారు.

ఆ సమయంలో పొంచివున్న పోలీసు బలగం గాలిలోకి తుపాకులు పేల్చుతూ రౌడీమూకను, గూఢచారులను చుట్టుముట్టి అందరినీ బంధించారు.

"మీరెలా వచ్చారు?" ఆశ్చర్యపడుతూ అడిగాడు నూరి.

"మన సార్జంటు సత్యం నేర్పు, అనుమానంతో సోనియాని, రౌడీమూకను వెన్నంటుతూ వచ్చాడు. బీచ్ లో మకాంవేసి యెవరి కోసమో యెదురు చూడడం పసిగట్టి, నాకు ఫోన్ చేశాడు" అన్నాడు ధనార్జనరావు.

"వెరి మనీ థాంక్స్. అండ్ కంగ్రాచ్యులేషన్స్!!" చెప్పుకున్నాడు నూరి.

"మిస్టర్ యువరాజ్, ఇంతకీ వాళ్ళంతా యెవరు?" అడిగాడు ధనార్జనరావు.

"పాకిస్తాన్, చైనాకు చెందిన గూఢచారులు. వాళ్ళు ఏకమై సాబర్ వద్ద ఉండిన రహస్యాలను చేపట్టడానికి కృషి చేసి ఉన్నారు. కానీ రహస్యాలు చేజిక్కలేదు..." అంటూ వివరంగా చెప్పాడు యువరాజ్.

"అయితే ఆ రహస్యాలు ఏమైనట్లు?"

"ఆ విషయమే నాకు అంతు చిక్కటంలేదు. సాబర్ బసచేసిన హోటలు గదిలోను, సాబర్ని చంపేటప్పుడు అతని శరీరంమీద వాళ్ళకు రహస్యాలు లభ్యంకాలేదు," చెప్పాడు యువరాజ్.

"అయితే ఏమైవుంటాయి? సాబర్ వాటిని యెక్కడ దాచి వుంటాడు?" అడిగాడు ధనార్జనరావు.

"ఏమో మనం ఇక కనుగొనాలి" ఆలోచనలలో పడ్తూ అన్నాడు.

"నా వూహ సరైనదైతే ఆ రహస్యాలు కాసర కొండవద్ద లభించి తీరాలి. రండి" అంటూ బయలుదేరాడు యువరాజ్.

ధనార్జనరావు, సూరీలు, ఆశ్చర్యచకితులైపోయారు.

జీపు కాసర కొండవైపు పరుగులు తీస్తూంది.

కాసర కొండను అందరూ చేరుకున్నారు.

యువరాజ్ దిగి సరాసరి ఆ బండరాయివద్ద కెళ్ళాడు. సాబర్ కూర్చుని ఉండాలని యువరాజ్ వూహ. సాబర్ కూర్చుని తనని ఎదురుచూచు సమయంలో శత్రువులు చుట్టుముట్టి ఉండాలి. ఆ క్లిష్ట పరిస్థితులలో సాబర్ ఏంచేసి ఉంటాడు? ఆలోచిస్తున్నాడు యువరాజ్.

సాబర్ తనకు చెప్పాలని పిలిచాడు. పిలిచినవాడు తప్పక రహస్యాలను తనతో తెచ్చుకొని వుంటాడు. అలా తెచ్చుకొన్న వాటిని శత్రువుల చేతుల చిక్కకుండా ఆ బండరాయి వద్ద దాచి ఉండాలని యువరాజ్ అనుమానించాడు.

మరో సందేహం కల్గింది. సాబర్ ఆ కాగితాలను కార్లో కి

ఉంచాదేమో? కారుని తగుల బెట్టేశారుగా!!

బండరాయిని ముగ్గురూ చుట్టిచుట్టి వచ్చారు. కనబడలేదు. సరికదా ఎటువంటి ఆచూకీ కన్పడలేదు.

యువరాజ్ మళ్ళీమళ్ళీ చూశాడు.

యువరాజు కేదో అనుమానం కల్గింది. ఒకదగ్గర మట్టి వుంది. ఆ మట్టి రాతిని అతుక్కుని వుంది. ఆ మట్టిని పట్టు కున్నాడు. పొడిపొడిగా చేతికి వచ్చింది.

"సూరీ! సాబర్ తనవద్దవున్న కాగితాలను క్రిందపడేసి కాలితో రాతిక్రిందకు నెట్టివున్నాడు." అంటూ ఇంకా పెక లించాడు తన మునివ్రేళ్ళతో.

"అయితే దొరికాయన్న మాట!" అన్నాడు ధనార్జన రావు ఆతృతగా చూస్తూ. యువరాజ్ పెదవి విరిచాడు. సూరి సంభ్రమాశ్చర్యాలకు లోనైపోయాడు.

అక్కడున్న కాగితాలను పూర్తిగా చెదలుపట్టి వుంది. చెదపురుగులు కాగితాలను సాంతం తినేసినై. కాగితాలకు బదులు చెదమట్టి గూడు కట్టుకు వుంది!! చెదపురుగులు చెల్లా చెదురై తిరుగుతున్నాయి.

అందరూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. వారి ముఖాలలో నిరుత్సాహం నిండిపోయింది. మాట్లాడ డానికి నోరు పెగలలేదు.

"మీ జీవితంలో ఇది విచిత్రమైన కేసు, మిస్టర్ యువ రాజ్!" అన్నాడు ధనార్జనరావు.

"అవును. ఉల్లిపాయలో ఏమో ఉంటుందని భ్రమపడి పొరలను విప్పుకుంటూ వెళ్ళగా ఏమీలేదు" అన్నాడు సూరి.

"ఆ విలేఖరి సంపాదించిన సాక్ష్యాల మూలంగా కమ్యూ నిస్ట్ రాజ్యాల అసలు స్వరూపాన్ని చూడొచ్చనుకున్నాను" బాధగా అన్నాడు యువరాజ్.

—: ఐపోయింది :—